# వైసిపి పాలనలో సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్

**అమరావతి:** వైసీపీ పాలనలో ఏపీ సంక్షోభంలో కూరుకుపోయిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీ అసెంబ్లీలో వైసీపీ సభ్యుల తీరు చూస్తే పాలసీ టెర్రరిజం గుర్తుకు వచ్చిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం జరిగేటప్పుడు డిగ్నిటీని మెయింటెయిన్ చేయాలని రూల్ బుక్‌లో కూడా రాసి ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు.అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే చర్చలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగానికి జనసేన పార్టీ తరఫున, వ్యక్తిగతంగా తన తరఫున ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఇలాంటి సెషన్ ఎప్పుడూ చూడలేదు... గొడవ ఎలా ఉంటుందో ఇప్పుడు చూడటమేనని పవన్ కల్యాణ్ అన్నారు. గతంలో గవర్నర్ ఈఎస్ఎల్ నర్సింహన్ ఉన్నప్పుడు తెలంగాణ అంశంలో ఇలాంటి గొడవ చూశానని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అసలు అసెంబ్లీలో ఇలా ప్రవర్తించవచ్చా అని తనకు అనిపిస్తోందని అన్నారు. వైసిపి సభ్యులే ఈ రూల్స్‌ను బ్రేక్ చేస్తే ప్రజలకు ఏం చెబుతామని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. అసెంబ్లీలో గొడవలు జరిగితే కేసులు ఎందుకు పెట్టరని మంత్రి మనోహర్‌ను అడిగానని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఇక్కడ సభ్యులపైన కేసులు పెట్టడం లేదంటే అన్ని విషయాలు మాట్లాడే స్వేచ్ఛ ఇచ్చారని కదా అని పవన్ కల్యాణ్ చెప్పారు. నిన్న వైసీపీ సభ్యులు గవర్నర్‌పై చేసిన గొడవ మంచిది కాదని అన్నారు. సుప్రీంకోర్టు జస్టిస్‌గా ఆయన ఉన్నప్పుడు ధైర్యం చేయగలరా, కళ్లల్లో చూడగలరా అని పవన్ కల్యాణ్ నిలదీశారు. నిన్న మీడియా ప్రతినిధులు తనను అడిగారు... వైసీపీ అనేది గొడవలకు పర్యాయపదమని విమర్శించారు. నిన్న అసెంబ్లీలో గొడవ జరిగిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇన్నేళ్లు వైసీపీ నేతలను తట్టుకొని నిలబడటం చూస్తే ఆయనకు హ్యాట్సాఫ్ చెప్పాలని పవన్ కల్యాణ్ అన్నారు. నిన్న వారి గొడవ చూస్తే ఎప్పుడైతే పేపర్లు విసిరేసి అక్కడికి వచ్చారో వివేకానంద రెడ్డి హత్య గుర్తుకువచ్చింది, ప్రజావేదిక, 200 ఆలయాల కూల్చివేతలు గుర్తుకువచ్చాయి, డాక్టర్ సుధాకర్ చనిపోవడం, జంగారెడ్డిగూడెం కల్తీసారా మరణాలు గుర్తుకువచ్చాయని పవన్ కల్యాణ్ చెప్పారు. పత్రికాధిపతులపై దాడులు, టీడీపీ నేతలపై జరిగిన దాడులు, 53రోజులు చంద్రబాబును జైల్లో పెట్టిన విధానం గుర్తుకు వచ్చింది, అమరావతి రైతులును పెట్టిన హింస గుర్తుకువచ్చిందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు.



గవర్నర్‌కు ఆరోగ్యం సరిగా లేకపోయినా ఆయన ప్రసంగించ్చినందుకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటినుంచి వైసీపీ సభ్యులను ఇబ్బంది పెట్టవద్దని సీఎం చంద్రబాబు చెప్పారని.. అయినా వైసీపీ సభ్యుల వ్యవహారశైలి మారలేదని పవన్ కల్యాణ్ అన్నారు. నిన్న సభలో నుంచి వైసీపీ సభ్యులు బయటకు వెళ్లిపోవడంలో తమ తప్పులేకపోయినా గవర్నర్‌కు ప్రభుత్వం తరపున క్షమాపణలు చెప్పామని అన్నారు. గత జగన్ ప్రభుత్వం మూడు ముక్కలు ఆడటంతో పెట్టుబడులు రాక ఏపీ ఆర్థిక పరిస్థితి క్షీణించిందని వాపోయారు. ఇలాంటి సమయంలో చంద్రబాబు ఈ సవాళ్లను ఎదుర్కొని ప్రభుత్వాన్ని ముందుకు నడుపుతున్నారని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. గత కొంత కాలంగా రాష్ట్రం ఆర్థిక సుస్థిరత కోల్పోయినా సీఎం చంద్రబాబు దారిలో పెడుతున్నారని చెప్పారు. పంచాయితీరాజ్‌లో అవినీతికి తావు లేకుండా ఉద్యోగుల బదిలీలు చేశామని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. గ్రామ సభలు రికార్డు స్థాయిలో ప్లలె పండుగ రూపంలో నిర్వహించామని పవన్ కల్యాణ్ తెలిపారు. రూ. 4500 కోట్ల వ్యయంతో 30వేల అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని అన్నారు. ఆరునెలల్లో 4300 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 22500 గోకులాలను నిర్మించామని తెలిపారు. 268 మినిగోకులాలను మాత్రమే వైసీపీ ఐదేళ్లలో ఏర్పాటు చేసిందన్నారు. విజన్ 2047కు అనుగుణంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జలజీవన్ మిషన్‌ను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. వీసీల నియామకాన్ని మెరిటోరియస్ ఓరియంటెడ్‌గా మంత్రి నారా లోకేష్ నియమించారని.. దానికి ఆయనను అభినందిస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'ఏపీలో అటవీ విస్తీర్ణం 50శాతానికి పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని దేవాలయాలు అటవీ ప్రాంతంలో ఉన్నాయి. అక్కడికి అడవిలో కొత్తదారి గుండా భక్తులు వెళ్లారు. అందుకే ఏనుగులు దాడి చేశాయి.. గున్న ఏనుగులను పంపాలని చూడటంతో దాడి చేశాయి. కుంకి ఏనుగుల కోసం కర్నాటకకు వెళ్తే అక్కడి వారు రూ.125 కోట్లు తమకు లాభం వచ్చిందని అన్నారు. ఇక్కడి ఎర్రచందనం అక్కడ పట్టుకొని ఆ ఆదాయం పొందారు... ఈ విషయం గత అటవీ మంత్రి ఎలా చూస్తారు ఆయనే అటవీ భూమిని ఆక్రమించారు. గిరిజన ప్రాంతాల్లో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా గిరిజన ప్రాంతాల్లో రహదారులు వేశాం... దీంతో ఆయా ప్రాంతాల్లో అంబులెన్స్ కూతలు వినపడ్డాయి. వైసీపీ పాలనలో ఏపీ నలిగిపోతున్న కాలంలో వారి ప్రభుత్వం ఇంకోసారి వస్తే రాష్ట్రం ఏమవుతుంది. గత ప్రభుత్వంలో ఎంత మంది ఇబ్బంది పడ్డారు అంటే 90శాతం మంది చేతులెత్తారు. విశాఖ స్టీల్ ఎ÷–లాంట్ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు వెళ్లాం.

# మండలిలో వైసిపి ,టిడిపిల మధ్య మాటల యుద్ధం

**అమరావతి:** ఏపీ శాసనమండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై చర్చలో భాగంగా కూటమి, వైసీపీ ఎమ్మెల్సీల మధ్య రగడ చోటు చేసుకుంది. వాడీ వేడీ చర్చ జరగింది. అధికార పార్టీ తీరును ఎమ్మెల్సీ వదురు కళ్యాణి ఎండగట్టారు. హామీలు ఇచ్చి అమలు చేయలేదని, వలంటీర్లను తొలగించారని, ఇష్టం వచ్చినట్లుగా విద్యుత్ చార్జీలు పెంచారని అన్నారు. అలాగే ఉద్యోగాల కల్పన అంశంపై మండలిలో వైసీపీ.. టీడీపీ మధ్య మాటల యుద్ధం నడిచింది. గవర్నర్ ప్రసంగం అంశంలో తెలుగు.. ఇంగ్లీష్‌లో ప్రచురణల మధ్య తేడా ఉంది అంటూ గందరగోళం నెలకొంది. ప్రజలను ఇబ్బంది పెడుతూ సుపరిపాలన అని చెప్పడం కూటమి ప్రభుత్వానికి ఎంత వరకు సమంజసమని వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్సీ కల్యాణి ప్రశ్నించారు. గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారని మండిపడ్డారు. నాలుగు లక్షల మంది ఉద్యోగాలు కల్పించామని స్పష్టంగా గవర్నర్ ప్రసంగంలో ఉందని వైసీపీ ఎమ్మెల్సీ అన్నారు.

దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. 'మేము ఉద్యోగాలు ఇచ్చామని ఎక్కడా చెప్పలేదు.. ఉద్యోగ అవకాశాలు కల్పించామనే చెప్పాం.. నియమించామని చెప్పలేదు' అని స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు వాస్తవాలు మాట్లాడాలన్నారు. వాకౌట్ చేయొద్దని.. అన్నింటిపైనా చర్చిద్దామని తెలిపారు. ఇంగ్లీష్ మీడియం కావాలని అంటారు... మళ్ళీ ఇంగ్లీష్‌లో చెప్తే ఇబ్బంది అంటారని మంత్రి అన్నారు. గవర్నర్ ప్రసంగం తెలుగు అనువాదంలో తేడా ఉందని.. తప్పుంటే మార్చుకుంటామని చెప్పండి అని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ ఎంపీలపై ఆధారపడి ఉందంటూ వైసీపీ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను మంత్రి లోకేష్ తప్పుబట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రానికి మద్దతు తెలిపామని స్పష్టం చేశారు. కేంద్రం మెడలు వంచి నిధులు తీసుకొస్తామని ఆనాడు పులివెందుల ఎమ్మెల్యే అన్నారని.. ఏమైందని అని ప్రశ్నించారు. ఐదేళ్లలో రాష్ట్రానికి చేసిందేంటి అని వైసీపీని నిలదీశారు. ఆనాడు రాష్ట్రాన్ని కాపాడాలని ప్రధాని మోదీని చంద్రబాబు, పవన్ కోరారని.. దానిలో భాగంగా ఇప్పుడు రైల్వేజోన్‌ను తీసుకొచ్చామని.. పోలవరం నిధులు, అమరావతికి నిధులు తీసుకొచ్చామని తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీఏ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం ఏపీకి చాలా చాలా అవసరమన్నారు. ఎలాంటి కండిషన్లు పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలకు కోసం టీడీపీ, జనసేన చేరామని.. అన్‌కండిషనల్‌గా మద్దతు తెలుపుతామన్నారు. ఐదేళ్లలో వైసీపీ తీసుకురాని నిధులను.. తొమ్మిది నెలలో రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. అలాగే వైసీపీ నేతలకు కూడా మంత్రి స్ట్రాం÷–రగ్ వార్నింగ్ ఇచ్చారు.

ఎవరైతే చట్టాలను ఉల్లంఘించి టీడీపీ నేతలు, కార్యకర్తలపై దాడి చేశారో వారిని వదిలే ప్రసక్తే లేదని.. మార్క్ మై వర్డ్స్ అంటూ హెచ్చరించారు. ఏపీ శాసనమండలిలో ఇంగ్లీష్ మీడియంపై రగడ చోటు చేసుకుంది. ఇంగ్లీష్ మీడియం లేకుండా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఎలా వస్తాయని వైసీపీ ఎమ్మెల్సీ మాధవ్ ప్రశ్నించగా.. హోంమంత్రి అనిత ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. వైసీపీ సభ్యులు తెలుగును అవమానిస్తున్నారని మండిపడ్డారు. తెలుగు మీడియంలో చదువుకున్న ఎంతో మంది ఉన్నత స్థానానికి వెళ్లారని.. ఆ విషయం వైసీపీ ఎమ్మెల్సీలకు తెలియదా అంటూ మండిపడ్డారు. వెంటనే వైసీపీ సభ్యులు తమ మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు మంత్రులు గొట్టిపాటి, డోలా బాలవీరాంజనీయ స్వామి,తదతరులు కూడా వైసిపి అతస్యాల ప్రచారాన్ని ఖండించారు. అయితే మంత్రులు పదేపదే లేచి అడ్డుకోవడంపై ఛైర్మన్ మోషెస్ రాజు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు



**హైదరాబాద్:** రాష్ట్రంలో బీఆర్ఎస్ లేకుండా బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి కుట్రలు పన్నుతున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కానీ వారు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల గుండెల్లో నిలిచేది బీఆర్ఎస్సే అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల వివాహాలకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. రూ. 15 వేలు రైతు భరోసా, రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తా అని మాయమాటలు చెప్పారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి 450 రోజులు అవుతుందని.. రోజుకు ఒకరి చొప్పున 450 మంది రైతులు ఆత్మహత్య చేసుకుకున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. భారతదేశంలో రైతు ఆత్మహత్యలు అత్యధికంగా తగ్గించింది కేసీఆర్ ప్రభుత్వం అని కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందని గుర్తు చేశారు. మరి కాలం తెచ్చిన కరువా..? కాంగ్రెస్ తెచ్చిన కరువా..? అర్థం చేసుకోవాలన్నారు. కేసీఆర్ మీద కోపంతోనే మేడిగడ్డ రిపేర్ చేయడం లేదని ఆరోపించారు. శివుడు గంగను కిందకు తీసుకువస్తే.. కేసీఆర్ గంగను పైకి తెచ్చిండని పేర్కొన్నారు. కానీ రైతులకు మాయమాటలు చెప్పి ఓట్లు కొల్లగొట్టారు అని కేటీఆర్ తెలిపారు. కాళేశ్వరంలో ఒక బ్యారేజ్‌లో ఒక పర్రె వడితే.. దానికి కాంగ్రెస్ నేతలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా లొల్లి పెట్టిండ్రు. మరి ఇవాళ సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే ఎవరు మాట్లాడరు. కాంగ్రెస్, బీజేపోడు నోరెత్తడు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోతే మాట్లాడరు. ఖమ్మం వద్ద పెద్దవాగు కొట్టుకుపోతే ఎవరు మాట్లాడరు. రేవంత్ రెడ్డికి రక్షణ కవచంలా బీజేపీ ఉంది. కాళేశ్వరంలో ఒక పిల్లర్‌కు పర్రె వడితే.. ఎన్డీఎస్ఏ వాలిపోయింది. మరి ఇవాళ ఎస్ఎల్‌బీసీలో టన్నెల్ కూలి దాదాపు 72 గంటలు అవుతుంది మరి ఎందుకు ఎన్డీఎస్ఏ రాలేదు. ఏ బీజేపోడు మాట్లాడడు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడం లేదు. ఏం ఇబ్బంది వచ్చింది. సుంకిశాల కూలిపోతే గవినోళ్ల శ్రీనివాస్ ఆర్టీఐ కింద రఖాస్తు పెట్టుకుంటే.. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. సమాధానం ఇవ్వమని చెప్పారు అని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ రెండే కాదు.. ఎన్నికల ప్రచారంలో మోదీ వచ్చి.. కాంగ్రెస్ పార్టీ అవినీతి ప్రభుత్వాన్ని నడుపుతుంది.. ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని గర్జించిండు. కానీ ఇంత వరకు చర్య లేదు. రేవంత్ రెడ్డి బామ్మర్ది కంపెనీ శోధా 2 కోట్ల లాభం ఆర్జించింది. అమృత్ స్కీంలో రూ. 1137 కోట్ల కాంటాక్ట్ ఇచ్చిండు బామ్మర్ది కంపెనీకి రేవంత్ రెడ్డి. దీని మీద విచారణ చేయాలని సంబంధిత కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశాం. ఆరు నెలలు అవుతంది.. ఇప్పటి వరకు స్పందన లేదు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ రైడ్ అయింది.. ఏం జరిగిందో తెలియదు కానీ ఇప్పటి వరకు ఎవరూ నోరు విప్పడం లేదు. ఇవన్నీ దేనికి సంకేతం.. ఎవరు ఎవర్ని కాపాడుతున్నారు. రేవంత్ రెడ్డి బీజేపీ మీద పల్లెత్తు మాట మాట్లాడం లేదు. కేసీఆర్ మీదనే మాట్లాడుతున్నడు. ఈ రాష్ట్రంలో కేసీఆర్ పార్టీ ఉంటే.. కాంగ్రెస్, బీజేపీ ఆటలు సాగవని తెలుసు కాబట్టి.. ఆ ఇద్దరు కలిసి కేసీఆర్ పార్టీని ఖతం చేయాలన్నదే ఆలోచన. అసెంబ్లీ ఎన్నికల్లో కుమ్మక్కై సక్సెస్ అయ్యారని కేటీఆర్ తెలిపారు.

## మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదు



**హైదరాబాద్:** మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదని మంత్రి సీతక్క అన్నారు. బీజేపీ టీం ఇండియా, కాంగ్రెస్ పాకిస్తాన్ అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఒకటి కూడా బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పి జిల్లాకు 200 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు యువకులకు జవాబు చెప్పుకోక మత రాజకీయాలకు బండి సంజయ్ పాల్పడుతున్నారని ఆగ్రహించారు. చెప్పుకోవడానికి అభివృద్ధి లేదని.. సబ్జెక్టు అంతకన్నా లేదన్నారు. అందుకే బండి సంజయ్ నోరు తెరిస్తే హిందూస్తాన్, పాకిస్తాన్, హిందూ, ముస్లిం తప్ప మరో మాట తెలియదని విరుచుకుపడ్డారు. 'సూటిగా బండి సంజయ్‌ను అడుగుతున్నా... పట్టభద్రులకు మీరేం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? ఎంత ఉపాధి కల్పించారు? ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మారు. ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారు. దేవుని పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ... దేవునికి వినియోగించే అగర్బత్తిల మీద కూడా జీఎస్టీ వేసింది. ఉన్నత విద్య మీద 18% జీఎస్టీ విధిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతుంది. అలాంటి బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదు. తెలంగాణ విభజన హామీలు అమలు కాలేదు. ఎన్నికలప్పుడే హిందూ ముస్లిం అని రెచ్చగొడతారు. బండి సంజయ్.. పాకిస్తాన్‌తో పోల్చి భారతదేశం గొప్పతనాన్ని తగ్గించొద్దు. పాకిస్తాన్‌తో పోల్చి దేశాన్ని కించపరచడం తప్ప మీరు దేశానికి చేసింది లేదు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికన ఎన్నికల్లోకి రండి" అంటూ సవాల్ విసిరారు. ట్రైబల్ యూనివర్సిటీ పనులు కూడా మొదలుపెట్టలేనీ అసమర్థ కేంద్ర ప్రభుత్వం అంటూ విమర్శించారు. బండి సంజయ్‌కు చెప్పుకోవడానికి ఏం లేదని.. మాట్లాడడానికి రెండు మాటలు రావన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేయాలనుకుంటే.. భారత సరిహద్దుల్లో ఉన్న సైనికుల మాదిరిగా యుద్ధంలో పాల్గొనాలని ఉచిత సలహా ఇచ్చారు. ఆకలి చావులు అంతర్గత సమస్యలతో దివాలా తీసిన పాకిస్తాన్‌తో పోల్చి.. దేశాన్ని అవమానపర్చవద్దన్నారు. పాకిస్తాన్‌తో భారతదేశాన్ని పోల్చి దేశ గౌరవాన్ని బండి సంజయ్ తగ్గిస్తున్నారని..

దేశ గౌరవాన్ని తగ్గిస్తున్న బండి సంజయ్‌ను బీజేపీ పెద్దలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. "భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన భారతీయులంతా నా సోదరులే అన్న మీరు భారత రాజ్యాంగాన్ని కాపాడతానని చెప్పిన మీరు.. అధికారం కోసం విద్వేష ప్రసంగాల అవసరమా. మీరు చేసింది శూన్యం. పట్టభద్రులారా ఆలోచించండి విద్యా వేత్త నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించండి. సంవత్సరకాలంలో 54 వేల ఉద్యోగాలు ఇచ్చాం. నరేందర్ రెడ్డిని గెలిపించి పనిచేసే ప్రభుత్వాన్ని సపోర్ట్ చేయండి. భావోద్వేగాలతో రాజకీయాలు చేసే బండి సంజయ్‌కు, బీజేపీకి గట్టిగా బుద్ధి చెప్పండి" అంటూ పిలుపునిచ్చారు. యువతను మత కొట్లాట వైపు మళ్లించి కేసులు నమోదు చేయించడమే బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. టీఆర్ఎస్, బీజేపీ దొందూ దొందే అని అన్నారు. జటిలమైనా ఎన్నో సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని స్పష్టం చేశారు. భారతదేశంలో యుద్ధ వాతావరణం సృష్టించే ప్రయత్నం మానుకోవాలని.. ఈ చిల్లర మాటలు మానేయాలని హితవుపలికారు. ఇలాంటి విద్వేషాపూరిత ప్రసంగాలు భారతీయుల ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ పాకిస్తాన్‌తో భారతదేశాన్ని పోల్చి దేశ గౌరవాన్ని కించపరుస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాలతో మనం పోల్చుకోవాలని మంత్రి సతీక్క వ్యాఖ్యలు చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో డితే రాజీనామా చేస్తారా

**సిద్దిపేట:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే రాజీనామాకు రేవంత్ రెడ్డి సిద్ధమా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సవాల్ విసిరారు. పనిచేశా.. ఓటు వేయమంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను తన పాలనకు రెఫరెండంగా తీసుకుంటారా అని ప్రశ్నించారు. మంగళవారం రఘునందన్ రావు మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికలతో తమ ప్రభుత్వానికి వచ్చేది లేదు.. పోయేది లేదు అంటున్న కాంగ్రెస్ నేతలు ఎందుకు పోటీ చేస్తున్నారని నిలదీశారు. కార్ రేస్ కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఏసీబీ రేవంత్ ప్రభుత్వం కంట్రోల్‌లో పని చేసేదే కదా అరెస్ట్ ఎందుకు చేయించడం లేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు అంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ఆధారమైనా చూపించాలని ఛాలెంజ్ చేశారు. పాత సీఎస్ సోమేష్ కుమార్ వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని చెప్పిన వాళ్లు.. ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రింగురోడ్డు టోల్ గేట్ కుంభకోణంలో రేవంత్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని రఘునందన్ రావు ప్రశ్నించారు. అంతకుముందు సిద్దిపేట కొండా భూదేవి గార్డెన్‌లో కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలుపును ఎవరూ ఆపలేరని జోస్యం చెప్పారు. ఇద్దరు బీజేపీ అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుస్తారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. మిగతా పార్లమెంట్‌లలో కంటే మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువ ఓట్లు సాధిస్తామని అన్నారు. గతంలో గెలిచిన నాయకులు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ పంచన చేరారు, కానీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని మండిపడ్డారు. ఇతర పార్టీలో నాయకులను కొన్నట్లుగా బీజేపీ పార్టీ నాయకులను కొనలేరని మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఉద్ఘాటించారు. బీసీలలో ముస్లింలను రేవంత్ రెడ్డి కలిపారని ఆరోపించారు. నూటికి 55శాతం బీసీలు ఉంటే వారికి ఉన్న వాటా ప్రకారం మంత్రి పదవులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎప్పుడు కూడా బీసీని ఎందుకు సీఎం చేయలేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేంద్రమంత్రి పదవుల్లో బీసీలకు మోదీ పెద్దపీట వేశారని చెప్పారు. ఒక్క మైనార్టీకి కూడా కాంగ్రెస్ మంత్రి పదవి ఇవ్వలేదని అన్నారు. తనకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదని చెప్పారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ముందుగా ధామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు నిర్ణయించాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నిన్నటి సభలో బీజేపీ గెలుస్తుందని చెప్పకనే చెప్పారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 14నెలల్లోనే ప్రజల విశ్వాసాలను కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. తన కోసం మూడు రోజులు కష్టపడితే తాను ఆరేళ్లు మీ కోసం కష్టపడతా నిరుద్యోగులకు అండగా ఉంటానని మాటిచ్చారు. ఎమ్మెల్సీ జీతం నుంచి వచ్చే డబ్బులను పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి హామీ ఇచ్చారు.

## ఎండాకాలం రాకముందే నీటికష్టాలు

హైదరాబాద్: కేసీఆర్ పాలనలో హైదరాబాద్ నగరంలో ఏ ఒక్కరోజు కూడా నీటి కష్టాల్లేవని.. కానీ ఇవాళ ఎండాకాలం రాకముందే.. నీళ్ల కష్టాలు మొదలయ్యాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే హైదరాబాద్‌లో తాగునీటి కష్టాలు మొలయ్యాయని హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. వేసవి రాకముందే బోర్లు ఎండిపోతున్నాయి. ప్రజలు డబ్బులు పెట్టి వాటర్ ట్యాంకర్లు తెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంతకు ముందెప్పుడూ హైదరాబాద్‌లో ఇలాంటి తాగునీటి సంక్షోభం రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదికే పరిస్థితి విషమించింది. దేశంలోనే భూగర్భ జలాలు భారీగా క్షీణించిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది. సామాన్యులు నీటి ట్యాంకర్ల కోసం భారీగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అని ఊదరగొట్టుకోవడం సిగ్గుచేటు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించాం. మిషన్ కాకతీయతో చెరువులను పునరుద్ధరించాం. ఎండాకాలంలో కూడా చెరువులు మత్తడులు దుంకినయి. కాంగ్రెస్ పాలనలో చెరువులు ఎండిపోతున్నాయి. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారంలో మునిగిపోయింది. పాలనపై శ్రద్ధ పెట్టకుండా రాజకీయ కక్ష సాధింపు చర్యలలో బిజీగా ఉన్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# ఎన్నోఏళ్ల కల నెరవేరబోతున్న వేళ..

**హైదరాబాద్:** ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్తను అందించింది. గత పదేళ్లకు పైగా అన్ని అర్హతలు ఉన్న తెల్లరేషన్‌కార్డు లేకపోవడంతో అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు మార్చి ఒకటి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటించింది. మార్చి ఒకటిన ఒకే రోజు లక్ష కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో లక్ష కార్డులను అధికారులు పంపిణీ చేయనున్నారు. కొత్త జిల్లాల ప్రకారం.. హైదరాబాద్– 285, వికారాబాద్ జిల్లా– 22 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లా– 15 వేలు, నారాయణపేట జిల్లా– 12 వేలు, వనపర్తి జిల్లా– 6 వేలు, మహబూబ్‌నగర్ జిల్లా– 13 వేలు, గద్వాల్ జిల్లా– 13 వేలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా– 6 వేలు, రంగారెడ్డి జిల్లా– 24 వేలు చొప్పున లక్ష కార్డులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మార్చి 8 తర్వాత అన్ని జిల్లాల్లో పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కాగా, 2014 నుంచి తెలంగాణలో నూతన రేషన్ కార్డులు జారీ చేయలేదు. ఈ పదేళ్లలో లక్షల మంది వివాహాలు చేసుకుని వేరుకాపురాలు పెట్టారు. ప్రభుత్వ పథకాలు ఏమైనా అందాలంటే రేషన్ కార్డులు కీలకం. కార్డులు లేక అనేక మంది సంక్షేమ పథకాలను కోల్పోయిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు నూతన కార్డులు జారీ చేస్తున్నట్లు తీపి కబురు చెప్పింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది జనవరి 26న కూడా 16,900 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేశారు. మరోసారి ఈ ప్రక్రియ చేపట్టి మరికొన్ని కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రజాపాలన, గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. తాజాగా మీ సేవా కేంద్రాల ద్వారా కూడా అప్లికేషన్లు తీసుకుంటున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం అర్హులకు నూతన కార్డులను మంజూరు చేయనున్నారు.

# పండుగ రోజే ఫ్లైఓవర్ అందుబాటులోకి...

**హైదరాబాద్:** హైదరాబాద్‌వాసులకు మహా శివరాత్రి కానుక అందించనున్నట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. నగరంలో కొన్నేళ్లుగా నిర్మాణ దశలో ఉన్న అంబర్‌పేట ఫ్లైఓవర్ ఎట్టకేలకు పూర్తయిన నేపథ్యంలో.. బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నట్టు కిషన్ రెడ్డి ప్రకటించారు. అంబర్ పేట ఫ్లైఓవర్‌పై రేపటి నుంచి రాకపోకలు ప్రారంభించనున్నట్టు తెలిపారు. మంగళవారం ఉదయం అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను కిషన్ రెడ్డి పరిశీలించారు. గోల్నాక నుంచి అంబర్‌పేట ఇరానీ హోటల్ వరకు ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించిన విషయం తెలిసిందే. అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. చాదర్‌ఘాట్ నుంచి వరంగల్ వెళ్లే జాతీయ రహదారికి.. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రోడ్డు విస్తరణ చేశారని.. కానీ అంబర్‌పేట ఛే నెంబర్ వద్ద రెండు వైపులా శ్మశాన వాటిక ఉండటం వల్ల రోడ్డు విస్తరణ కుదరలేదని తెలిపారు. తాను అంబర్ పేట శాసనసభ్యుడిగా, ఎంపీగా చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి.. శ్మశాన వాటిక ఉన్నందున ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని కోరానని చెప్పుకొచ్చారు. ఈ మార్గంలో విపరీతమైన రద్దీ ఉంటుందని.. స్థానిక ప్రజలు కూడా నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతుంటారని తెలిపారు. ఈ జాతీయ రహదారి గుండా వెళ్లే వరంగల్, ఖమ్మం ప్రజలు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఫ్లైఓవర్ మంజూరు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అడగ్గా.. ఆయన వెంటనే ఒప్పుకొని మంజూరు చేశారని కిషన్ రెడ్డి తెలిపారు. మరోవైపు.. ఫ్లైఓవర్ కింద రెండు వైపులా స్మశాన వాటికలు ఉండటం వల్ల.. రోడ్డు విస్తరణ ఇబ్బందిగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూసేకరణ పూర్తి చేయాలని కోరారు. అంబర్‌పేట ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చి మిగతా ఐదు చోట్ల భూసేకరణ చేసి రోడ్డు విస్తరణకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకచోట భూసేకరణకు సంబంధించి రూ.2 కోట్ల 51 లక్షలు చెక్కు తీసుకున్న తర్వాత కూడా స్థలం నేషనల్ హైవే అథారిటీకి అప్పగించలేదని గుర్తుచేశారు. దాన్ని త్వరగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కిషన్ రెడ్డి కోరారు. జీహెచ్ఎంసీ, నేషనల్ హైవే అధికారులతో ఇటీవల తాను ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్టు కిషన్ రెడ్డి తెలిపారు. ఫ్లైఓవర్ కింద మంచి రోడ్డు వేయడంతో పాటు, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చేయాలని అధికారులను సూచించినట్టు తెలిపారు. అయితే.. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా సాధ్యం కాదని చెప్పారని వెల్లడించారు. ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి ట్రాఫిక్‌ను పైనుంచి పంపిస్తూ.. కింద రోడ్డు, బ్యూటిఫికేషన్ పనులు చేయాలని అధికారులకు సూచించినట్టు విరరించారు. కాబట్టి మిగిలిపోయిన చోట్ల కూడా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసి నేషనల్ హైవే అథారిటీకి అప్పగిస్తే ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. ఈ శివరాత్రి నుంచి ఫ్లైఓవర్ మీనుంచి ట్రాఫిక్ వదిలి.. కింద రోడ్డు నిర్మాణం, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ ఫ్లైఓవర్కు సంబంధించి తాను గతంలో కేసీఆర్‌కు, ఇప్పుడు రేవంత్ రెడ్డికి అనేక ఉత్తరాలు రాసినట్టు తెలిపారు. భూసేకరణను వేగవంతం చేయాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశానన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి.. మిగిలిపోయిన ఆరు చోట్ల భూసేకరణను చేపట్టాలని కోరారు. ఈ ఫ్లైఓవర్ కోసం ఇప్పటి వరకు రూ.338 కోట్లు ఖర్చు చేసినట్టు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ట్రాఫిక్ కష్టాలకు శివరాత్రితో కొంత ఉపశమనం కలుగుతుందని కిషన్ రెడ్డి తెలిపారు.

## నమ్మి ఓట్లేస్తే ప్రజలు, రైతులకు రేవంత్‌రెడ్డి చుక్కలు

**వరంగల్:** కాంగ్రెస్ బూటకపు మాటలను నమ్మి ఓట్లేసి గెలిపిస్తే ప్రజలకు రేవంత్‌రెడ్డి చుక్కలు చూపిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ప్రజలు, రైతుల కష్టాలు పట్టించుకునే స్థితిలో అటు బీజేపీగానీ, ఇటు కాంగ్రెస్ గానీ లేదని ఆయన ఆరోపించారు. జిల్లాలోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను దయాకర్‌రావుతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు మిర్చి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. బోగస్ మాటలు మాట్లాడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకో, అబద్ధాలు మాట్లాడడం మానుకో అని హెచ్చరించారు. రైతు బంధు ఇవ్వలేదు, రుణమాఫీ పూర్తి చేయకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. యూరియా కోసం రైతులు చెప్పులు లైన్లలో పెట్టుకుంటున్నారని విమర్శించారు. మిర్చి రైతును ఆదుకోవాలి, క్వింటాకు 25 వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

# టి.డి.ఆర్. బాండ్ల ధ్రువీకరణ వేగవంతం చేయండి.

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, ఫిబ్రవరి 25.**



టి.డి.ఆర్. బాండ్ల ధ్రువీకరణ పనులు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. టి.డి.ఆర్. బాండ్ల ధ్రువీకరణ, స్థల యాజమానుల గుర్తింపు, ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్, ఫైళ్ల పరిష్కారం తదితర అంశాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు, కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి టి.డి.ఆర్. బాండ్లు అందేలా వారి యొక్క ధ్రువపత్రాలు పరిశీలన చేయాలని అన్నారు. మీరు స్వయంగా వెళ్లి స్థల యజమానిని గుర్తించి పరిశీలన చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేక లాగిన్ చేయించి, రిజిస్టర్ చేయించాలని అన్నారు. టి.డి.ఆర్. బాండ్లు దృవీకరణలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఏదైనా పొరపాట్లకు తావిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయకుండా చూడాలని అన్నారు. నగరంలో అనధికార భవన నిర్మాణాలు జరకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. ప్రభుత్వ భూముల పర్యవేక్షణ మనందరి బాధ్యతగా పని చేయాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్. ఫైళ్లు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డి.సి.పి. మాహాపాత్ర, ఏ.సి.పి.లు బాలాజి, మూర్తి, టి.పి.బి.ఓ. లు మధు, వంశీ, ప్లానింగ్ కార్యదర్శులు, రోడ్డు ఇన్చార్జి లు తదితరులు ఉన్నారు.

# భక్తుల మనోరథాన్ని అధిరోహించిన దేవదేవుడు

**వేడుకగా రథోత్సవం**

**భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తులు**

**ఫిబ్రవరి 26న చక్రస్నానం**

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, ఫిబ్రవరి 25**





శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన మంగళవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు రథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8.40 నుండి 9.40 గంటల వరకు శ్రీ భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారి రథాన్ని దర్శించిన వారికి జన్మాదిదుఃఖాలు నశించి, మోక్షం లభిస్తుంది. రథస్థుడైన మాధవుడిని దర్శిస్తే పునర్జన్మ ఉండదని అర్చకులు తెలిపారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి,ఎస్ఇ శ్రీ మనోహరం, ఇఇ శ్రీ జగనోహ్మన్ రెడ్డి, విజివో శ్రీమతి సదాలక్ష్మి, ఏఈవో శ్రీ గోపినాథ్, వైఖానస ఆగమ సలహాదారులు శ్రీ మోహన రంగాచార్యులు, సూపరింటెండెంట్ శ్రీ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు శ్రీ బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీ మునికుమార్, శ్రీ ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ఫిబ్రవరి 26న చక్రస్నానం :**

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన బుధవారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరుగనుంది. ఇందులో భాగంగా ఉదయం 9 నుండి 10 గంటల వరకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఆలయం ఎదురుగా గల పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా చక్రస్నానం జరుగనుంది.

# ఎమ్మిగనూరు ఆర్టీసీ కండక్టర్ డ్రైవర్ దుర్భాషలు

**సాక్షి గణపతి వద్ద బస్సు ఆపీ దిగు అంటున్న కండక్టర్**

**ఉత్తేజిత శ్రీశైలం ప్రతినిధి**




మార్చి 2వ తేదీన శ్రీశైలంలో ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ లో బస్టాండ్ లో ఎనిమిదిన్నర గంటల సమయంలో నా పేరు వెల్లటూరి వెంకట శివుడు తండ్రి పుల్లన్న నివాసము శ్రీశైలం దేవస్థానం ఈరోజు అనగా 25వ తేదీన ఉదయం 8గంటల 30 నిమిషాల సమయంలో నేను శ్రీశైలం నుండి ఆత్మకూరుకు వచ్చుచున్నాను ఎమ్మిగనూరు బస్సు ఏపీ 39 జెడ్ 0799నెంబర్ గల బస్సును నేను ఎక్కడం జరిగింది అందులో సీట్ కెపాసిట్ పూర్తి కానప్పటికీ నేను సీట్లో కూర్చొని ఉండగా సీట్లు లేవు నీవు బస్సు దిగు వెళ్లిపో అని కండక్టర్ డ్రైవరు ఇరువురు దిగిపోవాలంటే నాతో గొడవ పడ్డారు నాకు అర్జెంటుగా పని ఉన్నది సీట్లు లేకుండా నిలబడి వెళ్తాను ఆత్మకూరుకి అంటే కూడా వినకుండా నేను సీట్లు ఉన్నాయి కదా అని అడగగా ఇది రిజర్వేషన్ దోర్నాలలో రిజర్వేషన్ ఉన్నవి అంటూ సాక్షి గణపతి వద్దకు రాగానే నన్ను ఫారెస్ట్ లో బస్సు ఆపి దిగిపొమ్మని నన్ను దిగవలసినదిగా ఒత్తిడి చేసి నాపట్ల కండక్టర్ వెంకటేశ్వర్లు అసభ్యకరంగా మాట్లాడుతూ ఒక విధంగా నన్ను ప్రయాణికుని అని చూడకుండా నన్ను ఇబ్బందులకు గురి చేయడంతో పాటు కనీసం మర్యాద లేకుండా ప్రవర్తించడంతో అతి తక్కువ మందితో బస్సును నడిచే విధంగా ఆర్టిసి సంస్థకు నష్టం వచ్చేలాగా తన విధులు విధానాలను కొనసాగించాడు తమ ఆర్టీసీ సంస్థకు చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా నడుచుకుంటున్నాడు

కావున ఇతనిపై తగు చర్యలు తీసుకొని మరో కస్టమర్స్ కు ఇలాంటి కండక్టర్లతో డ్రైవర్లతో కష్టాలు రాకుండా ఆర్టీసీ ప్రయాణం మాత్రమే కొనసాగించాలని ఇలాంటి కండక్టర్లు ఉండడం వల్లనే ఎక్కువ శాతం ప్రజలు కర్ణాటక బస్సులకు టికెట్ తీసుకొని పయనిస్తున్నారు శ్రీశైలంలో 20 మంది ప్రజాప్రయాణికులను సీటు కెపాసిటీ లేదని దించిన కండక్టర్ 20 మంది అంటే ఆర్టీసీకి 5000 నష్టం వాటిల్లినట్టే కదా కనుక శ్రీశైలంలో కొంతమందిని ఆర్టీసీ అధికారులను శ్రీశైలం బస్టాండ్ లో ఉంచి బస్సు యాత్రికులకు ఇబ్బంది కరం లేకుండా బస్సులు ఎక్కించుకునే విధానంగా చూడవలయునని మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడమని మరియు తమ ఆర్టీసీ సిబ్బంది వారు తమ విధివిధానాలను అతిక్రమించకుండా చూడమని వారు బాధ్యతగా వ్యవహరించగా విధి విధానాలను చూడాలని మరియు ఆర్టీసీ సంస్థకు నష్టం వాటిల్లకుండా చూడమని కోరుచున్నాము

అలాగే ఆత్మకూర్ ఆర్టీసీ బస్టాండ్ లో కంప్లైంట్ ఇవ్వడం జరిగిందిటికెట్ మీద డ్రైవర్ నెంబర్ 427332. సర్వీస్ నెంబర్ 51248 మీడియా రిపోర్టర్ వెల్లటూరి వెంకట శివుడు సెల్ నెంబర్ 7075671089

# శివుడు అభిషేక ప్రియుడు

శ్రీకాళహస్తి: శివుడు అభిషేక ప్రియుడే గాకుండా.. అలాగే బిల్వదళ ప్రియుడు. శివుడు ఎలా పిలిచినా అనుగ్రహిస్తాడని అందుకే భోళాశంకరుడని పురాణాలు కూడా చెబుతున్నాయి. అందుకే అభిషేకాలు, బిల్వార్చనలను శివరాత్రినాడు విధిగా చేస్తుంటారు. పరమశివుడు లింగాకారంలో పుట్టినరోజు కావడంచేత శివుడికి ఇష్టమైన ఆ రోజున శివపూజ జరపడం మంచిదని శైవం చెబుతోంది. త్రిమూర్తులలో మూడోవాడు శివుడు. బ్రహ్మ సృష్టికర్త. విష్ణువు సంరక్షకుడు. మహాశివరాత్రి వ్రతాచరణను గురించి లింగ పురాణం పేర్కొంటోంది. వ్రత ఉద్యాపన గురించి స్కందపురాణంలో వివరంగా ఉంది. శివరాత్రి నాడు పగలంతా ఉపవాసం, రాత్రిపూట లింగార్చన, జాగరణం చేస్తారు. లింగార్చన తరువాత పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం చేయడం కూడా ఓ అలవాటుగా వస్తోంది. శివరాత్రులు అయిదు రకాలు. అవి.. నిత్య శివరాత్రి, పక్ష శివరాత్రి, మాస శివరాత్రి, మహాశివరాత్రి, యోగశివరాత్రి. నిత్యశివరాత్రి అంటే ప్రతిరోజూ రాత్రిపూట చేసే శివారాధన. పక్ష శివరాత్రి అంటే ప్రతి పదిహేను రోజులకొకసారి శివార్చన కోసం నిర్దేశిరచిన రాత్రి. మాసశివరాత్రి అంటే ప్రతి మాసంలోనూ శివపూజకు ఉద్దేశించిన రాత్రి. మిగతా శివరాత్రులు ఏవి కుదిరినా కుదరకపోయినా ఏడాదికొకసారి వచ్చే మహాశివరాత్రినాడు శివపూజ చేయడం పుణ్యప్రదం. తెలిసైనా, తెలియకైనా కొన్ని నీళ్ళు శివలింగం మీద పోసి మరికొన్ని మారేడు దళాలు ఆ

శివలింగంమీద పెడితే భోళాశంకరుడు పరవశించి అలా చేసినవారిని అనుగ్రహించిన కథలు ఎన్నెన్నో మన పురాణాల్లో కనిపిస్తున్నాయి. శివరాత్రినాటి లింగోద్భవ సమయంలో చేసే అభిషేకాలలో కూడా కొన్ని నియమాలున్నాయి. రాత్రి జాగరణం చేస్తూ నాలుగు జాములలోనూ నాలుగు సార్లు నాలుగు రకాలుగా అభిషేకాలు చేస్తుంటారు. మొదటి జాములో పాలతో అభిషేకించి, పద్మాలతో పూజచేసి పెసర పప్పు, బియ్యం కలిపి పులగం వండి శివుడికి నైవేద్యం పెడతారు. రుగ్వేద మంత్ర పఠనం జరుపుతారు. రెండో జాములో పెరుగుతో అభిషేకం, తులసీ దళార్చనచేసి, పాయసం నైవేద్యంపెట్టి యజుర్వేద మంత్రాలను చదువుతారు. మూడోజాములో నేతితో అభిషేకించి, మారేడు దళాలతో అర్చించి, నువ్వుల పొడి కలిపిన తిను బండారాలను నివేదిస్తారు. సామవేద మంత్రపఠన చేస్తారు. నాలుగో జాములో తేనెతో అభిషేకంచేసి నల్ల కలువలతో పూజించి అన్నం నివేదిస్తారు. అధర్వణ వేద మంత్రాలను చదువు తారు. ఇలా అభిషేకాలు చేసే శక్తిలేనివారు అభిషేకం చేసేటప్పుడు శివదర్శనం చేసుకున్నా పుణ్యమే నంటారు. నాలుగో జాము ముగిశాక ఉదయంపూట శివుడిని ఊరేగిస్తారు. ఇలా ఊరేగించడం వెనుక ఓ సామాజిక అంతరార్థం ఉంది. అందుకే భక్తులు శివరాత్రి రోజు అభిషేకం చేసి జాగారం చేయడం ఆనవాయితీగా వస్తోంది. శివుడు మిగతా దేవతలతో పోలిస్తే సులువగా అనుగ్రహం ఇస్తాడని నమ్మిక. శివనామంతో సర్వపాపాలు హరించుకుని పోతాయని అంటారు. అందుకే మనదేశంలో అనే శైవాలయాలు ప్రత్యేకతను సంతరించు కున్నాయి. శివుడు లయకారకుడు. శివారాధకులకు మహాశిరాత్రి పర్వదినం. ఉపవాసం ఈ పండగ ప్రత్యేకత. శివుడు భోళా శంకరుడు కావడంతో అడకుండానే వరాలిచ్చే దేవుడుగా ప్రతీతి. శివరాత్రి రోజు ఉపవాసంతో... రాత్రి అభిషేకించి జాగారం చేస్తే ముక్తి లభిస్తుందని ఆర్యోక్తి. అందుకే శివరాత్రి జాగారాలకు ప్రాధాన్యం ఉంది. ఈశాన సంహిత ప్రకారం శివుడు అర్థరాత్రి సమయంలో తేజోలింగంగా ఆవిర్భవించాడు. అదే లింగోద్భవ కాలం. మహాశివరాత్రి మాఘమాసం కృష్ణపక్షంలో అర్థరాత్రి ఉండే చతుర్దశి తిథినాడు వస్తుంది. చతుర్దశి ఈతిథి శివుడికి ఎంతో ప్రీతికరమైంది. అందులోనూ కృష్ణచతుర్దశి అంటే అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి తిథి మరీ ప్రీతికరమైంది. ఆ కారణంగానే ప్రతి మాసంలోనూ వచ్చే కృష్ణచతుర్దశి తిథులు మాసశివరాత్రులుగా ఉంటాయి. సంవత్సరం లోని పన్నెండు శివరాత్రులలో మాఘమాసంలో వచ్చే శివరాత్రి శివుడికి బాగా ఇష్టమైంది కాబట్టి దాన్ని మహాశివరాత్రి అని అంటారు. కాశితో పాటు జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు. వినాయక చవితి, శ్రీరామ నవమి లాంటి పండుగలలో దేవుళ్లను పగటిపూట పూజిస్తారు. శివరాత్రినాడు శివుడిని రాత్రిపూట మాత్రమే పూజించడం, మిగిలిన పండుగలలా పంచభక్ష్య పరమాన్నాలతో కాక ఉపవాస దీక్షతో శివరాత్రి పండుగను జరుపుకోవడం ఓ విశేషం. యోగి అయినవాడు తన యోగబలం చేత యోగనిద్రలోకి వెళ్లే రాత్రిని యోగ శివరాత్రి అని అంటారు. సాధారణంగా రాత్రిపూట దేవీపూజను, పగటిపూట దేవపూజను చేయడం ఒక ఆచారంగా ఉంటుంది. కానీ శివరాత్రి విషయంలో మాత్రం ఇది భిన్నంగా కనిపిస్తుంది. శివరాత్రి రోజున రాత్రిపూటే శివపూజ జరుగుతుంది. ఇలా శివ ఆరాధన రాత్రిపూట జరగడానికి ఓ కారణం కూడా ఉంది. పూర్వం ఓసారి ప్రళయం వచ్చినప్పుడు అంతా కటికచీకటిగా మారిపోయింది. ఆ సమయంలో లోక కల్యాణం కోసం పార్వతీదేవి శివుడిని గురించి తపస్సు చేసింది. ఆనాటి పార్వతి తపస్సు మెచ్చిన శివుడు ఆ చీకటిని పోగొట్టి మళ్లీ మామూలుగా రాత్రి, పగలు ఏర్పడేలా చేశాడు. దాంతో జీవులన్నీ మళ్లీ ఆనందించాయి. తాను చేసినట్లుగా అంత రాత్రివేళ శివుడిని గురించి పూజలు చేసినవారికి సర్వసుఖాలు కలిగేలా అనుగ్రహించమని పార్వతీదేవి శివుడిని ప్రార్థించింది. శివుడు అందుకు అంగీకరించాడు. పార్వతి

చేసిన శివపూజకు గుర్తుగా ఆనాటి నుంచి మహాశివరాత్రి పూజా పర్వదినం ఏర్పడింది. ఎవరైనా ఏ కారణం చేతనైనా ఆలయాలకు వెళ్ళి శివదర్శనం చేసుకోలేకపోతే వారికి ఆ ఊరేగింపును చూసి పుణ్యం పొందే భాగ్యం కలుగుతుందని అంటారు.

# భక్తుల రాకతో కిటకిటలాడుతున్నశ్రీశైలం

**శ్రీశైలం:** ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీభ్రమరాంబికామల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. భక్తులతో శ్రీశైలం కిటకిటలాడుతోంది. శివనామస్మరణతో ఆలయ పురవీధులు మారుమ్రోగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వారికి వాహనసేవలు వైభవంగా సాగుతున్నాయి.

శ్రీశైల పుణ్యక్షేత్రం భక్తులతో రద్దీగా మారింది. శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామిదర్శనం చేసుకోవటానికి నల్లమల అటవీప్రాంతం నుంచి భారీగా భక్తులు తరలి రావడంతో శ్రీగిరులు భక్తులతో కోలాహలంగా మారయి. ఆదిదంపతులైన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు కల్యాణశోభతో ముస్తాబయ్యారు. ఆలయ ప్రాంగణంలోని అలంకారమండపంలో స్వామి అమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణ లతో విశేషపూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తజనం నడుమ గ్రామోత్సవానికి తీసుకొచ్చారు. ఉత్సవం ముంగిట మహిళల కోలాటాలు, వేషధారణలు, డోలు

విన్యాసాలు, నందికోళ విన్యాసాలు, బుట్టబొమ్మలు వంటి సాంస్కృతిక కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం నుంచి అడుగడుగునా ఉత్సవమూర్తులకు మంగళహారతులు ఇచ్చుకుంటూ పురవీధుల్లోకి తీసుకువచ్చారు. గంగాధరమండపం వద్ద రంగు రంగుల పుష్పాలు, విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేసిన పుష్పపల్లకీలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి అర్చకులు మంగళహారతులిచ్చారు.

# శ్రీకాళహస్తిలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వేకువజామున రెండు గంటలకే సర్వదర్శనం ప్రారంభించాలని ముక్కంటి ఆలయాధికారులు నిర్ణయించారు. వేకువజామున ఒంటి గంటలకు లింగోద్భవ దర్శన ఏర్పాట్లు చేయనున్నారు. భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఇప్పటికే ప్రధాన ఆలయాన్ని ముచ్చటైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గోపురాలకు కొత్త రంగులద్దడంతో కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెనలపైనా, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. అరటిచెట్లు, మామిడాకుల పచ్చతోరణాలు, కాషాయరంగు జెండాలతో వీధులు దర్శనమిస్తున్నాయి. తరలి వచ్చే భక్తుల కోసం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళాప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు.

# శ్రీశైల స్వామి దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్

**ఉత్తేజిత శ్రీశైలం ప్రతినిధి**



మార్చి 25వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైనటువంటి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వాముల వారి శ్రీశైల దేవస్థానం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దంపతులు రెండు రోజుల శ్రీశైలం పర్యటన ముగించుకొని 25ఉదయం 11:35 నిమిషాలకు సున్నిపెంట హెలిపాడ్ మైదానం నుంచి హెలిపాడ్ లో విజయవాడకు బయలుదేరి వెళ్లారు

రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ గారికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి రాజకుమారి, కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ రాష్ట్ర గవర్నర్ గారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

# చారిత్రక ఘట్టంగా మహాకుంభమేళా

భారతదేశంలో మహోజ్వల ఘట్టం ముగింపు దశకు చేరుకుంది. 144 ఏళ్లకోమారు వచ్చే మహాకుంభమేళా మహాశివరాత్రి పర్వదినంతో ముగియనుంది. ఇప్పటికే 65కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి నట్లు యూపి ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. శివరాత్రి బుధవారం మరింతమంది చేరితే అసలు లెక్కలు తేలుతాయి. అయితే పవిత్ర స్నానాలు ఆచరించిన వారి సంఖ్యను చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ జనాభా భారత జనాభాకు సగంగా ఉండడం విశేషం. దేశవిదేశాల నుంచి కూడా కోట్లాది సంఖ్యలో భక్తులు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు, సిఎ యోగి ఆదిత్యనాథ్, ఎపి మంత్రులు పవన్ కళ్యాణ్, లోకేవ్ దంపతులు ఇలా ఒక్కరేమిటి ఎందరో విఐపిలు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వల్ప ఘటనలు మినహా ఓ రకంగా కుంభమేళా అద్భుతంగా సాగిందనే చెప్పాలి. మౌని అమావాస్య రోజు జరిగిన తొక్కిసలాట ఒక్కటే కొంత ఆందోళనకు గురిచేసింది. రెండుమూడు చిన్నచిన్న ఘటనలు..అంటే స్వల్ప అగ్నిప్రమాదాల్లాంటివి జరిగాయి. ఇవి మినహా అంతా ప్రశాంతంగా ముగిసింది. ఇందుకు యూపి ప్రభుత్వాన్ని అభినందిం చాల్సిందే. దాదాపు రెండేళ్ల ముందునుంచే ఈ మహాఘట్టం కోసం ఏర్పాట్లు మొదలయ్యాయంటే .. ఎంతగా జాగ్రత్తలు తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ఇక చివరిదశకు చేరింది. ఇవరాత్రి పర్వదిన స్నానాలతో ఈ మహాకుంభమేళా ముగియనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివెళ్తున్నారు. చివరి అమృత్ స్నానం కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రయాగ్‌రాజ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్టం చేశారు. భక్తుల స్నానాలకు ఇబ్బందులు లేకుండా తొక్కిసలాటకు అవకాశం లేకుండా గట్టి ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి కుంభమేళా

ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్' గా అధికారులు ప్రకటించారు. ప్రయాగ్‌రాజ్ మొత్తం ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు చెందిన వాహనాలను మాత్రమే అనుమతించనున్నట్లు ప్రకటించారు. యాత్రికులంతా ఈ మార్గదర్శకాలను పాటించాలని, అధికారులకు సహకరించాలని ప్రభుత్వం కోరింది. చివరి రోజు అమృత స్నానాల కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుంభమేళా ప్రాంతంలో రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా లక్నో, ప్రతాప్‌గఢ్ వైపు నుంచి వచ్చే యాత్రికుల కోసం ఫాఫామౌ ఘాట్‌ను నియమించారు.

# కరెంట్‌కు కరెంట్ ఫ్రీ.. డబ్బులకు డబ్బులు..

ఏపీలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం సౌర విద్యుత్ అందించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. పీఎం సూర్యఘర్ పథకం కింద రాష్ట్రంలోని 20 లక్షల కనెక్షన్లకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందించనున్నారు. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖరారు చేసింది. సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకున్న కుటుంబాలకు 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్ ఇవ్వనున్నారు. అలాగే ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకున్నందుకు చదరపు అడుగుకు రూపాయి చొప్పున లీజు చెల్లించనున్నారు.




ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సౌర విద్యుత్ అందించనుంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు చెందిన 20.10 లక్షల విద్యుత్ కనెక్షన్లకు పీఎం సూర్యఘర్ పథకం అమలు చేయనున్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద 20 లక్షల కనెక్షన్లకు ఉచితంగా సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల పలకలు ఏర్పాటు చేస్తారు. లబ్ధిదారులపై భారం లేకుండా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దీనికి తోడు సౌర పలకలు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వమే ప్రతి నెలా కొంత మొత్తాన్ని లీజు రూపంలో చెల్లించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన విధివిధానాలను ఏపీ ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీలో పీఎం సూర్యఘర్ పథకం విధివిధానాలు

పీఎం సూర్యఘర్ పథకం ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన 20 లక్షల కనెక్షన్ల ఇళ్లపై 2 కిలోవాట్ల సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో లబ్ధిదారులపై ఎలాంటి భారం పడకుండా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సౌర విద్యుత్ అందిస్తారు. అలాగే ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకున్నందుకు గానూ చదరపు అడుగుకు రూపాయి చొప్పున ప్రభుత్వం వారికి లీజు చెల్లించనుంది. ఒక్కో ఇంటిపై ప్యానెళ్లు ఏర్పాటు చేయడానికి 200 చదరపు అడుగులు అవసరమవు తాయని అంచనా. ఆ లెక్కన 200 చదరపు అడుగులకు 200 రూపాయలు ప్రభుత్వం లీజు చెల్లిస్తుంది.

అయితే నెలకు 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వాడే ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా 7.7 లక్షల వినియోగదారుల ఇళ్ల మీద రూఫ్‌టాప్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తారు. ఈ రూఫ్‌టాప్ ప్రాజెక్టుల ద్వారా 1,550 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూఫ్‌టాప్ ఫలకలు, వర్చువల్ నెట్ మీటరు ప్రభుత్వమే ఏర్పాటు చేయనుంది.. అలాగే స్మార్ట్ మీటర్ ధర కూడా ప్రాజెక్టు వ్యయంలో కలిసి ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకూ ప్రభుత్వం ఉచిత కరెంట్ ఇస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో సుమారుగా 21.10 లక్షల కుటుంబాలు ఈ ఉచిత విద్యుత్ పథకం ప్రయోజనం పొందుతున్నట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. ఉచిత విద్యుత్ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా భారీగా ఖర్చు చేస్తోంది. అయితే ఈ కుటుంబాలకు సౌర విద్యుత్ అందించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు నిధులు చెల్లిస్తూ వస్తోంది. అయితే రాష్ట్రం చెల్లించే ఈ మొత్తాన్ని డిస్కం రుణంగా తీసుకుని ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు సోలార్ ప్యానెళ్ల ప్రాజెక్టు అమలు చేస్తాయి. డిస్కంలు తీసుకున్న రుణం వాయిదాను ప్రతి నెలా ప్రభుత్వం చెల్లిస్తుందని విధివిధానాల్లో పేర్కొన్నారు.

పథకంలో భాగంగా ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులు ఏర్పాటుచేసే సంస్థలకు 12 ఏళ్ల పాటు వాటి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. అందులో ఐదేళ్లు ఉచితంగా చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రాజెక్టులను డిస్కంలకు అప్పగించాలి. అలాగే ప్రాజెక్టు వ్యయాన్ని కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం ఐదేళ్ల పాటు విడతల వారీగా చెల్లిస్తుంది. మొదటి ఏడాదిలో 75 శాతం, రెండో సంవత్సరం 10 శాతం, మిగిలిన దానిని ఏటా 5 శాతం చొప్పున మూడేళ్లలో చెల్లిస్తుందని ప్రభుత్వం విధివిధానాల్లో పేర్కొంది.



## విద్యార్థులు ఎగిరి గంతేసే వార్త..

ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ఎంతసేపు తరగతులు, పుస్తకాలు, పరీక్షలు, మార్కులే కాకుండా విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెంపొందించేలా ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా విద్యార్థులను విజ్ఞానయాత్రలకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. చదువంటే కేవలం పుస్తకాల్లోని అంశాలు మాత్రమే కాదని.. తరగతితోనే విజ్ఞానం రాదని.. బయటి ప్రపంచంలో జరిగే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మళ్లీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2014-19 మధ్య సమయంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో విద్యార్థులకు విజ్ఞాన, విహారయాత్రలు ప్రవేశపెట్టారు. అయితే వైసీపీ హయాంలో ఇవి

## శ్రీవారి మెట్టు మార్గంలో పోటెత్తిన భక్తులు..



కలియుగ వైకుంఠం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇక, మెట్టు మార్గం ద్వారా కొండకు చేరుకునే భక్తుల సంఖ్య అదికంగా ఉంది. ఇక్కడ 3 వేల టోకెన్లను శనివారం కేటాయించగా.. అవన్నీ గంటల్లోనే అయిపోయాయి. దీంతో చాలా మంది భక్తులు నిరాశకు గురయ్యారు. వీరంతా సర్వ దర్శనాల కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వారాంతం కావడంతో తిరుమల శ్రీవారి దర్శనాలకు భక్తులు శనివారం పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ముఖ్యంగా శ్రీవారి మెట్టుకు భక్తులు పోటెత్తారు. ఈ మార్గంలో తక్కువ సమయంలోనే కాలినడకన తిరుమల చేరుకోవచ్చనే ఉద్దేశంతో పెద్దఎత్తున మెట్టు మార్గానికి వచ్చారు. అయితే, ఆటోడ్రైవర్ల కారణంగానే అక్కడ రద్దీ ఏర్పడింది. మెట్టు మార్గం వద్ద పనిచేసే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సిబ్బందితో ఒప్పందం చేసుకున్న ఆటోడ్రైవర్లు.. టైమ్‌స్లాట్ టోకెన్లు ఇప్పిస్తామని దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ఇక్కడికి తీసుకొచ్చారు.

దీంతో ఈ టోకెన్ల విషయమై ఆటో డ్రైవర్ల మధ్య గొడవ జరిగింది. 3 వేల టోకెన్లు జారీ చేయగా గంటల్లో ఖాళీ అయ్యాయి. దీంతో మిగతా భక్తులు సర్వదర్శనానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతకొద్ది రోజులుగా రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు నుంచి భక్తులను తమ ఆటోలో వస్తే క్షణాల్లో స్వామివారి టైమ్‌స్లాట్ దర్శన టోకెన్లు ఇప్పిస్తామని ఆటో డ్రైవర్లు నమ్మించి మోసగిస్తున్నారు. వారి మాటలకు నమ్మి వారు అధిక ఛార్జీల దోపిడీకి గురవుతున్నారు. వీరి నుంచి రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు.

టైమ్ స్లాట్

దర్శన టోకెన్ల పేరుతో తిరుపతి నుంచి శ్రీవారిమెట్టుకు ఆటోవాలాలు భక్తుల్ని తరలిస్తున్నారు. ఒక్కో ఆటో డ్రైవర్ 5 లేక 7 మంది భక్తుల బృందం నుంచి రూ.10 వేలకు పైగా వసూలు చేసినట్లు చెబుతున్నారు. శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారిమెట్టు చేరుకునే ఒక్కో భక్తుడు నుంచి రూ.500 వసూలు చేశారంటున్నారు. దీంతో శ్రీవారిమెట్టు మార్గం దగ్గరకు భక్తుల భారీగ తరలిరావడంతో అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. వాస్తవానికి శ్రీనివాస మంగాపురం నుంచి శ్రీవారి మెట్టు వద్దకు వెళ్లడానికి ఆర్టీసీ బస్ సర్వీసు ఉంది. ఫ్రీ బస్ సర్వీసు కూడా ఉంది. కానీ, ఆటోవాలాలు చెప్పే మాయమాటలు విని కొందరు ఎక్కువ డబ్బులు చెల్లించి ఆటోలు ఎక్కుతున్నారు. తీరా శ్రీవారి మెట్టు వద్దకు వెళ్లేసరికి ట్రాఫిక్ జామ్. శ్రీవారి మెట్టు వద్ద జారీ చేసే టోకెన్ల సంఖ్య మూడు వేలే కాబట్టి.. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది వాహనాలన్నింటినీ ఒకేసారి పంపడం లేదు.

## కొత్త రేషన్ కార్డులపై బిగ్ అప్‌డేట్..

రాష్ట్ర ప్రజలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. కొత్త రేషన్ కార్డుల జారీకి చర్యలు ప్రారంభించింది. ఈ విషయాన్ని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. వచ్చే నెల నుంచి క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త రేషన్ కార్డులు అందించనున్నట్లు మంత్రి తెలిపారు, శనివారం నెల్లూరు జిల్లాలో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు, ఈ సందర్భంగానే కొత్త రేషన్ కార్డులపై కీలక వ్యాఖ్యలు చేశారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అన్ని సచివాలయాల్లో అవకాశం కల్పిస్తామని మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు మొదలెట్టింది. తాము అధికారంలోకి వస్తే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. ఇక ఇచ్చిన మాట ప్రకారం కొత్త రేషన్ కార్డుల జారీ కోసం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. వాస్తవానికి సంక్రాంతి సమయంలోనే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారంటూ వార్తలు వచ్చాయి. డిసెంబర్ నెలలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారని, సంక్రాంతి నాటికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తారంటూ గతంలో ప్రచారం జరిగింది. అయితే వివిధ కారణాలతో ఆ దిశగా అడుగులు పడలేదు. తాజాగా కొత్త రేషన్ కార్డులపై ఏపీ ప్రభుత్వం నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కొత్త రేషన్ కార్డులపై కీలక వ్యాఖ్యలు చేశారు.

మార్చి నెల నుంచి రాష్ట్రంలో క్యూఆర్ కోడ్‌తో కొత్త రేషన్ కార్డులు అందిస్తామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అలాగే రేషన్ కార్డులలో మార్పులకు, చేర్పులకూ అవకాశం కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సచివాలయాల్లోనూ ఈ ప్రక్రియ మొదలు అవుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగంలో మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు మంత్రి నాదెండ్ల మనోహర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం కలెక్టరేట్లో సమీక్షా సమావేశం నిర్వహించారు.

అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడిన మంత్రి నాదెండ్ల.. కొత్త రేషన్ కార్డులపై కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే నెల నుంచి క్యూఆర్ కోడ్‌తో కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే వైసీపీ హయాంలో ధాన్యం రైతులకు చెల్లించాల్సిన రూ.1,674 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెల్లించిందని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. నెల్లూరు జిల్లాలోని రైతులకు అందాల్సిన రవాణా, హమాలీ ఛార్జీలను ఒకట్రెండు రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారు.

మరోవైపు రేషన్ కార్డు రూపురేఖల్ని మార్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. క్రెడిట్ కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారుగా 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి.







ఉత్తేజిత దినపత్రిక



## పవిత్రమైన బాబా ముసుగులో.. ఒంటరిగా ఉన్న మహిళను..!

మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం ఉప్పెరగూడెంలో ఇద్దరు నకిలీ బాబాలు.. పట్టపగలే ఓ మహిళను నమ్మించి మోసం చేశారు. జాతకం చెప్తామంటూ మాయమాటలు చెప్పి ఇంట్లో మహిళ ఒంటరిగా ఉందని తెలుసుకుని.. తమ అసలు స్వరూపాలు భయపెట్టారు. బొట్టు పెట్టి విభూది చల్లి.. అపస్మారక స్థితిలోకి జారుకోగానే.. మహిళ ఒంటిపై ఉన్న బంగారంతో పాటు ఇంట్లో ఉన్న నగదు కూడా దోచుకుని పరారయ్యారు. మెలుకువలోకి వచ్చిన తర్వాత చూస్తే.. అప్పుడు అసలు విషయం తెలిసింది.

జనాలు పూర్తిగా బరితెగించిపోతున్నారు. అమాయకులు, ఒంటరిగా ఉండే మహిళలు, వృద్ధులు, ఎన్నో ఆశలతో ఉండే మధ్యతరగతి ప్రజలే టార్గెట్‌గా చేసుకుని.. రకరకాల మోసాలకు పాల్పడుతున్నారు. ఏ చిన్న అవకాశమున్నా వదిలిపెట్టకుండా.. ఎదుటివారిని మోసం చేసి సులభంగా డబ్బు సంపాదించాలని చూస్తున్నారు. ఈ క్రమంలో.. ఇప్పటికే సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలతో జనాల ఖాతాలు ఖాళీ చేస్తుంటే.. ఇప్పుడు మరికొందరు పగటివేషగాళ్ల రూపంలో గ్రామాల్లో ఉండే సామాన్యులపై పడ్డారు. అది కూడా పవిత్రమైన బాబాల వేషం వేసుకుని పాడు ఆలోచనలు, పనులు చేస్తున్నారు. తాజాగా.. బాబా వేషం వేసుకున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను బురిడీ కొట్టించారు.

మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం ఉప్పెర గూడెంకు చెందిన గంగాధరి శోభ తన పిల్లలతో కలిసి గతకొంత కాలంగా తల్లిగారి ఇంటి వద్దే ఉంటోంది. శుక్రవారం (ఫిబ్రవరి 21న) రోజున శోభ ఇంట్లో ఒంటరిగా ఉంది. అదే సమయంలో.. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బాబా వేషధారణలో ఇంటికి వచ్చారు. నీ జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురవుతున్నాయి.. సీతమ్మ తల్లికి ఉన్నన్ని కష్టాలున్నాయంటూ.. శోభను చూడగానే జాతకం చెప్పటం మొదలుపెట్టేశారు. అయితే.. శోభ జీవితంలో జరుగుతున్న కొన్ని సంఘటనలతో సరిపడటంతో.. ఆమె కూడా ఆ వ్యక్తులు నిజమైన బాబాలేనేమోనని నమ్మేసింది.

దీంతో.. ఇంట్లోకి పిలిచి కుర్చీలు వేసి కూర్చొబెట్టింది. తనకు లెక్కలేనన్ని కష్టాలు, ఇబ్బందులు ఉన్నాయని.. వాటికి పారిష్కారం చెప్పాలంటూ ఆ దొంగ బాబాలను వేడుకుంది. దీంతో.. కొన్ని పరిష్కార మార్గాలున్నాయని వివరించిన ఆ దొంగ బాబాలు.. ఆమెకు బొట్టు పెట్టి, పైన విభూది చల్లారు. దీంతో.. కాసేపటికే శోభ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అటు ఆమె స్పృహ కోల్పోగానే.. వాళ్ల పని మొదలుపెట్టేశారు.

శోభ ఒంటిపై ఉన్న ఆమె చెవి కమ్మలు, మాటీలతో పాటు నిలువుదోపిడీగా అన్ని ఆభరణాలు దోచుకున్నారు. బంగారంతో పాటు.. ఇంట్లో కొంత నగదు కూడా తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. స్పృహలో నుంచి బయటకు వచ్చిన శోభ.. ఏం జరిగిందో తెలియక అయోమయంలో పడింది. తీరా చెవులు తడుముకుని చూస్తే కమ్మలు లేవు.. మాటీలు కూడా కనిపించలేదు. నకిలీ బాబాలు తనను మోసం చేశారని గ్రహించిన శోభ.. శనివారం (ఫిబ్రవరి 23) రోజున ఇచ్చిన పోలీసులను ఆశ్రయించింది. శోభ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్న పని చేస్తే చాలు బర్డ్‌ఫ్లూ రాదు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం బర్డ్ ఫ్లూ భయం నడుస్తోంది. చికెన్ తినాలా వద్దా.. చికెన్ తింటే బర్డ్ ఫ్లూ వస్తుందా..? అయితే.. ఈ అనుమానాలను నివృత్తి చేసేందుకు పలు సంస్థలు ఇప్పటికే రకరకాల కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఫ్రీగా చికెన్ పంపిణీ చేస్తూ.. ఎలా తినటం వల్ల బర్డ్ ఫ్లూ రాదన్నది అవగాహన కల్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో ప్రముఖ కంపెనీ కీలక ప్రకటన జారీ చేసింది.

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలను అనుమానాలకు, ఆందోళనకు మధ్య అయోమయానికి గురి చేస్తున్న పదం బర్డ్ ఫ్లూ. ఇటు తెలంగాణతో పాటు అటు ఏపీలోనూ వేల కొద్ది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో చికెన్ తినాలా వద్దా.. గుడ్లు తింటే సేఫేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే.. అక్కడక్కడ బర్డ్ ఫ్లూ కేసులు నమోదవుతుండటంతో.. అమ్మో చికెన్ తింటే బర్డ్ ఫ్లూ వస్తుందా అన్న ఆందోళనలు కూడా వెంటాడుతున్నాయి. ఈ క్రమంలోనే.. ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేసి.. అవగాహన కల్పించేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి.

ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఉచితంగా చికెన్, గుడ్లు పంపిణీ చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తుండగా.. ఎలా వండుకుని తింటే బర్డ్ ఫ్లూ రాదన్న విషయాలపై వైద్యులు, నిపుణులు జాగ్రత్తలు, సూచనలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. జనాల్లో చికెన్ పట్ల భయాన్ని పోగొట్టేందుకు ఫౌల్ట్రీ బ్రీడర్స్ కోఆర్డినేషన్ అసోసియేషన్ కీలక ప్రకటనలు జారీ చేస్తోంది. ఈ మేరకు పత్రికలు, ప్రసార సాధనాల్లో ప్రకటనలు చేస్తోంది. చికెన్ తినడం సురక్షితం అంటూ ప్రకటన విడుదల చేసింది.

ప్రకారం 70 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడిలో చికెన్, గుడ్లు వండటం వల్ల.. బర్డ్ ఫ్లూ వైరస్ ఉన్నా చనిపోతుందంటూ ఫౌల్ట్రీ బ్రీడర్స్ కోఆర్డినేషన్ అసోసియేషన్ అవగాహనకల్పించే ప్రయత్నం చేస్తోంది. అయితే.. భారత దేశంలో 100 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడిలోనే చికెన్, గుడ్లు వండుతారని.. అందువల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని.. మాంసప్రియులు నిర్భయంగా చికెన్, గుడ్లు తినొచ్చని వివరించింది.

ఇదిలా ఉంటే.. బర్డ్ ఫ్లూ దెబ్బకు తెలుగు రాష్ట్రాల్లో చికెన్ అమ్మకాలు నేల చూపులు చూస్తున్నాయి. ఇదే సమయంలో మటన్, చేపల మార్కెట్ జోరుగా నడుస్తోంది. మటన్ కేజీ ధర ఏకంగా రూ.1100కు చేరుకుంది. ఇక చేపల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి.

బర్డ్ ఫ్లూ ఎక్కువగా కోళ్లు, టర్కీ కోళ్లు, బాతులకు వస్తుంది. ఈ వ్యాధి రావడానికి కారణం ఇన్‌ఫ్లూయెంజా ఏ వైరస్‌లు. బర్డ్ ఫ్లూ వ్యాధి మనుషులకు కూడా సోకే అవకాశం ఉంది. వ్యాధి సోకిన కోళ్లు తిరిగిన ప్రదేశాల్లో ఏవైనా వస్తువుల్ని ముట్టుకుంటే.. అప్పుడు కూడా మనుషులకు ఇది సోకే ప్రమాదం ఉంటుంది. కోళ్ల వ్యర్థాల నుంచి గాలిలో వైరస్ విస్తరించే అవకాశం ఉంది. అయితే.. మనుషులకు ఈ వ్యాధి చాలా అరుదుగా సోకుతోంది.

బర్డ్ ఫ్లూ.. సోకితే జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కళ్లలో ఇన్ఫెక్షన్ వస్తుంది. వ్యాధి తీవ్రం అయితే, ఊపిరితిత్తులు నీటితో నిండిపోయి నిమోనియా వస్తుంది, ఊపిరి సరిగా తీసుకోలేరు. బ్రెయిన్, ఉపిరి తిత్తులు దెబ్బతినవచ్చు. అరుదుగా మరణాలు కూడా సంభవించవచ్చు. కోడిని సరిగా ఉడకబెట్టకపోయినా, కోడి గుడ్లను సరిగా వండకపోయినా వైరస్ మనుషులకు సోకే ప్రమాదం ఉంటుంది. వైరస్ చనిపోవాలంటే.. కనీసం 70 డిగ్రీలకు పైగా సెల్సియస్‌లో వండుకుంటే సరిపోతుందంటున్నారు నిపుణులు.



## కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మాటిచ్చారా..?

**కేసీఆర్ మాట్లాడుతున్న 17 సెకన్ల నిడివి ఉన్న ఓ వీడియోను తత్వం-అసి అనే యూజర్ ఫిబ్రవరి 21న ఎక్స్‌లో పోస్టు చేశారు**

తెలంగాణలో దేవాలయాలు, వక్ఫ్ బోర్డుకు చెందిన వేలాది ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయని కేసీఆర్ గతంలో అసెంబ్లీ సాక్షిగా మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 77,538 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు చెందినది ప్రభుత్వం గెజిట్ చేసిందని ఓ సందర్భంలో ఆయన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వక్ఫ్ బోర్డు భూములను కంపెనీలకు కేటాయించారని.. ఈ ఖాళీ భూములను తిరిగి వక్ఫ్ బోర్డుకు అప్పగిస్తామన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారు. కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే వక్ఫ్ బోర్డు విషయం లోనూ ఆయన హయాంలో కొన్ని కీలక చర్చలు జరిగాయి. అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ వక్ఫ్ బోర్డ్కు సంబంధించిన ఆస్తుల గురించి మాట్లాడిన సందర్భాలున్నాయి. అయితే కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడిన పాత వీడియో క్లిప్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

'మాటిస్తున్నా.. తెలంగాణలోని ఖాళీ ప్రదేశాలన్నీ వక్ఫ్ బోర్డుకు ఇస్తాం. వక్ఫ్ బోర్డుకు మేజిస్టీరియల్ అధికారాలు ఇవ్వడం కోసం ఓ బిల్లు తీసుకొస్తాం' అని కేసీఆర్ మాట్లాడుతున్న 17 సెకన్ల నిడివి ఉన్న ఓ వీడియోను తత్వం-అసి అనే యూజర్ ఫిబ్రవరి 21న ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఖాళీ భూములను వక్ఫ్ బోర్డుకు ఇస్తామని కేసీఆర్ మాట్లాడిన వీడియో కోసం సజగ్ టీమ్ ఇంటర్నెట్లో వెతికింది. సంబంధిత కీవర్డ్స్‌తో గూగుల్‌లో వెతకగా.. 'వక్ఫ్ బోర్డుకు న్యాయపరమైన అధికారాలు ఇవ్వనున్న తెలంగాణ' అని అర్థం వచ్చే ఇంగ్లిష్ హెడ్డింగ్‌తో 2017 జనవరి 19న డెక్కన్ క్రానికల్ న్యూస్ వెబ్‌సైట్లో ప్రచురితమైన కథనం కనిపించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాలు ఎంఎన్‌సీలకు కేటాయించి, ఖాళీగా ఉన్న వక్ఫ్ భూములను వక్ఫ్ బోర్డుకు హ్యాండోవర్ చేసుకుంటామని కేసీఆర్ చెప్పినట్లు ఈ కథనంలో పేర్కొన్నారు. సంబంధిత కీవర్డ్స్‌తో యూట్యూబ్‌లో వెతకగా.. 2017 జనవరి 18న ఎన్టీవీ తెలుగు న్యూస్ ఛానెల్‌కు చెందిన యూట్యూబ్ ఛానెల్లో 'ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ గురించి కేసీఆర్ ప్రసంగం' అనే హెడ్డింగ్‌తో పబ్లిష్ చేసిన వీడియో కనిపించింది. అక్బరుద్దీన్ ఓవైసీ ప్రశ్నకు సమాధానం ఇస్తున్నానంటూ కేసీఆర్ మాట్లాడటాన్ని చూడొచ్చు.

'గతంలో వివిధ సంస్థలకు కేటాయించిన వక్ఫ్ ఖాళీ భూములను తిరిగి వక్ఫ్ బోర్డుకు అప్పగిస్తాం. ఇందుకోసం ఓ హౌజ్ కమిటీని ఏర్పాటు చేసి.. ఈ ఖాళీ భూములను, ఆక్రమణకు గురైన భూములను కచ్చితంగా వక్ఫ్ బోర్డుకు అప్పగిస్తాం. ఓ బిల్లును తీసుకొచ్చి వక్ఫ్ బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు ఇస్తాం' అని కేసీఆర్ మాట్లాడారు. 42 నిమిషాల 25 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోలో.. 22 నిమిషాల తర్వాత కేసీఆర్ ఈ టాపిక్ గురించి మాట్లాడారు. మీడియాలో వచ్చిన కథనాలు, యూట్యూబ్‌లో ఉన్న వీడియోను బట్టి.. కేసీఆర్ మాట్లాడింది వక్ఫ్ బోర్డు ఖాళీ భూముల గురించి అని స్పష్టంగా తెలుస్తోంది.

వక్ఫ్ బోర్డుకు చెందిన ఖాళీ స్థలాలను గతంలో వివిధ సంస్థలకు కేటాయించారని.. ఈ స్థలాలను తిరిగి వక్ఫ్ బోర్డుకు అప్పగిస్తామని మాత్రమే కేసీఆర్ చెప్పారు. అంతేకానీ రాష్ట్రంలో ఉన్న ఖాళీ స్థలాలన్నింటినీ వక్ఫ్ బోర్డుకు అప్పగిస్తామని ఆయన చెప్పలేదు. కేసీఆర్ మాట్లాడిన దాంట్లో 17 సెకన్ల నిడివి ఉన్న వీడియోను మాత్రమే కట్ చేసి తప్పుదోవ పట్టించేలా వైరల్ చేస్తున్నారని సజగ్ టీమ్ గుర్తించింది.

## తెలంగాణలో కొత్త బ్రాండ్ల మందు..!

తెలంగాణ మందుబాబులకు అదిరిపోయే వార్త వినిపించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇప్పటికే ఉన్న మద్యం బ్రాండ్లతో పాటు మరిన్ని కొత్త బ్రాండ్లను ఆహ్వానించేందుకు తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు.. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ అవసరమైన చర్యలు కూడా చేపట్టింది. తెలంగాణలో ఇప్పటివరకు లేని విదేశీ బ్రాండ్లతో పాటు దేశీయ బ్రాండ్లు కూడా కొత్త బ్రాండ్ల అమ్మకాలు జరుపుకునేందుకు దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు.. సరికొత్త విధానాన్ని తీసుకొచ్చింది ప్రభుత్వం.

తెలంగాణలోని మందుబాబులకు రేవంత్ రెడ్డి సర్కార్ కిక్కెక్కించే వార్త వినిపించింది. ఇప్పుడున్న బ్రాండ్లతో పాటు కొత్త బ్రాండ్లు కూడా రాబోతున్నాయన్న శుభవార్త తీసుకొచ్చింది. ఈ మేరకు.. కొత్త లిక్కర్ బ్రాండ్స్‌ను ఆహ్వానించేందుకు అవసరమైన చర్యలను తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ చేపట్టింది కూడా. ప్రభుత్వం ఆదేశాల మేరకు.. కొత్త కంపెనీల మద్యం బ్రాండ్లకు అనుమతులు ఇవ్వనున్నారు. తెలంగాణలోలేని విదేశీ బ్రాండ్లతో పాటు దేశీయ లిక్కర్ బీర్ కంపెనీలు కూడా తమ మద్యం ఉత్పత్తి బ్రాండ్లను అమ్మకాలు జరుపుకునేందుకు కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు.

కొత్త కంపెనీలు.. ఇతర రాష్ట్రాల్లో జరుపుతున్న తమ మద్యం అమ్మకాలపై నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు జరుపుతున్నట్లుగా, మద్యం అమ్మకాలపై ఎలాంటి ఆరోపణలు లేవన్న నిర్ధారణ పత్రాలను దరఖాస్తులో జతపరచాలని టీజీబీసీఎల్ కోరింది. అయితే.. తెలంగాణలో పలు కొత్త కంపెనీలు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇటీవల టీజీబీసీఎల్ కొందరికి అనుమతులు ఇచ్చింది. పర్మిషన్ ఇచ్చిన కొత్త కంపెనీలపై పలు ఆరోపణలు రావడంతో వాటిని మళ్లీ నిలిపేసింది. ఈ నేపథ్యంలో.. తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్ల ఆహ్వానానికి కొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది.

కొత్త దరఖాస్తులను ఆహ్వానించే ముందు బహిరంగ ప్రకటన ఇవ్వాలని టీజీబీసీలకు సర్కార్ ఆదేశించింది. టీజీబీసీఎల్ తెలంగాణలో రిజిస్టర్ కానీ కొత్త సప్లయర్స్ నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి ప్రకటన జారీ చేసింది. కొత్త కంపెనీల నుంచి వచ్చిన దరఖాస్తులను 10 రోజుల పాటు ఆన్‌లైన్‌లో పెట్టాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులపై వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరిపి అనుమతులపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. టీజీబీసీఎల్‌లో ఇప్పటికే రిజిస్టరై.. సరఫరా చేస్తున్న సప్లయర్స్ మాత్రం ప్రస్తుతం ఉన్న పద్ధతిలోనే కొత్త బ్రాండ్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. వీటన్నిటిని తరువాత ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ కొత్త మద్యం బ్రాండ్లపై తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకోనుంది.

గతంలో ఏపీలో వచ్చిన లోకల్ బ్రాండ్లు తెలంగాణకు కూడా వస్తాయని ప్రచారం జరగటమే కాకుండా కొన్ని చోట్ల అమ్మకాలు కూడా జరిపాయి. అయితే వాటిపై పెద్ద ఎత్తున విమర్శలు రావటంతో.. మళ్లీ వాటి అమ్మకాలు నిలిపేశారు. అయితే.. వచ్చే కొత్త బ్రాండ్లు ఎలాంటివన్నది సర్వత్రా చర్చ నడుస్తోంది.



## రేపు స్కూళ్లు, కాలేజీలకు సెలవు

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 24న విద్యాసంస్థలకు సెలవు ఇచ్చారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ఇస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. బదులుగా ఏప్రిల్ 12న రెండో శనివారం వర్కింగ్ డేగా పరిగణించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇది నిజంగా విద్యార్థులు ఎగిరిగంతేసే వార్త. ఎందుకుంటే తెలంగాణ ప్రభుత్వం రేపు స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించింది. అయితే ఈ సెలవు తెలంగాణ మొత్తం కాదు. కేవలం ఆదిలాబాద్ జిల్లాలో మాత్రమే. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 24న ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు సెలవు మంజూరు చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ఇస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ప్రకటన విడుదల చేశారు. రేపటి సెలవుకు బదులుగా ఏప్రిల్ 12న రెండో శనివారం వర్కింగ్ డేగా పరిగణించాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఉత్సవాల్లో భాగంగా రేపు ఆదిలాబాద్ రాం లీలా మైదానంలో వేడుకల నిర్వహణకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తుంది. కాగా, ఈనెల 26న కూడా ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మహా శివరాత్రి పర్వదినం సదర్భంగా సర్కార్ సెలవు మంజూరు చేసింది. ఈనెల 25న ఒక్కరోజు స్కూళుకు వెళితే.. మళ్లీ 26న సెలవు రానుంది. తెలంగాణలో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి నడుస్తోంది. మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలతో పాటు నల్గొండ- ఖమ్మం- వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 27న పోలింగ్ జరగనుంది. ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు మంజూరు చేసింది. 27న ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఓటున్న ప్రభుత్వ ఉద్యోగులు ఓటు వేసేందుకు సెలవు మంజూరు చేసింది.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి కారణం కేసీఆరే..



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటన ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అగ్గిరాజేస్తోంది. ఓవైపు టన్నెల్‌లో చిక్కుకుపోయిన కార్మికులను కాపాడేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతుండగానే.. ఇటు అధికార ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ నేపథ్యంలోనే.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎస్ఎస్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి కారణం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆరే కారణమని తీన్మార్ మలన్న సంచలన ఆరోపణలు చేశారు.

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్‌లో జరిగిన ప్రమాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాద ఘటన అటు రాజకీయంగా మరోసారి అగ్గిరాజేసింది. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇందులో భాగంగానే కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.. కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆరే కారణమంటూ కీలక ఆరోపణలు చేశారు. తాజాగా తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన తీన్మార్ మల్లన్న.. గతంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ గురించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు.

"ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద నేనే కుర్చీ వేసుకోని కూర్చుంటా.. ఎవడు ఆపుతాడో చూస్తా.. టన్నెల్ పూర్తి చేసి శ్రీశైలం నుంచి నీళ్లు తెస్తా.." అని.. 2014 నల్గొండ ఎన్జీ కాలేజీలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార సభలో కేసీఆర్ మాట్లాడారని తీన్మార్ మల్లన్న గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆ పని ఎందుకు చేయలేదని కేసీఆర్‌ను తీన్మార్ మల్లన్న ప్రశ్నించారు. అప్పుడే కేసీఆర్ ప్రాజెక్టు పూర్తి చేసుంటే.. ఇప్పుడు ఈ ప్రమాదం జరిగేది కాదని దుయ్యబట్టారు. కేసీఆర్ నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి కేసీఆరే కారణం అయ్యారని తీన్మార్ మల్లన్న ఆరోపించారు. గత పదేళ్లలో ఎస్-ఎల్‌బీసీని కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. కానీ నేడు ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి గురైన వ్యక్తులను రక్షించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం తనవంతు కృషి చేస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే.. నాగర్ కర్నూల్ జిల్లా దోమల పెంట సమీపంలోని శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగంలో శనివారం (ఫిబ్రవరి 22న) ఉదయం ఎనిమిదిన్నర సమయంలే భారీ ప్రమాదం జరిగింది. 14 కిలోమీటర్ల తర్వతా మూడు మీటర్ల మేర పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులకు గాయాలు కాగా.. 8 మంది సొరంగం లోపలే చిక్కుకుపోయారు. ప్రమాద సమయంలో టన్నెల్‌లో సుమారు 35 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఉదయం షిఫ్ట్ పనులకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా ఈ ఘటన జరగటంతో రాష్ట్రమంతా ఉలిక్కిపడింది.



## వైజాగ్ లోకల్ బాయ్ నాని అరెస్ట్..

టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేసిన పోస్టు వల్ల వైజాగ్ లోకల్ బాయ్ నాని అరెస్టయ్యాడు. కాగా.. నాని అరెస్టుపై సజ్జనార్ స్పందించారు. తాను చేసి పోస్టు వల్లే నానిని వైజాగ్ పోలీసులు అరెస్టు చేశారని.. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయటం చట్టరిత్యా నేరమని పోస్టు చేశారు. అంతకుముందు.. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయటం ఆపేస్తున్నానంటూ నాని చేసిన వీడియోకు కూడా పంచుకున్న సజ్జనార్.. నాని లాగే ప్రమోట్ చేయటం ఆపేయ్యాలంటూ మిగతా ఇన్‌ఫ్లుయెన్సర్లకు సూచించారు. టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ.. సమాజంలో జరిగే పలు సంఘటనలపై స్పందిస్తుంటారు. ముఖ్యంగా.. రోడ్డుపై వాహనదారులు చేసే చిన్న చిన్న తప్పుల వల్ల జరిగే పెద్ద పెద్ద ప్రమాదాలకు సంబంధించిన వీడియోలను పంచుకుంటుంటారు. అవే కాకుండా.. బైక్ రేసింగులని, స్టంట్లంటూ యువత చేసే కొన్ని అకతాయి పనులను కూడా వెలుగులోకి తీసుకొచ్చి ప్రజల్లో అవేర్‌నెస్ కల్పిస్తుంటారు. ఇవన్నీ కాకుండా.. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు చేసే కొన్ని పనులపై సజ్జనార్ సీరియస్‌గా స్పందిస్తుంటారు. రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులు చేసినా, బెట్టింగ్ యాప్‌ల గురించి ప్రమోషన్లు చేసినా.. సజ్జనార్ వెంటనే స్పందించి.. వారిపై చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు సూచిస్తుంటారు.

ఈ క్రమంలోనే.. ఇటీవల వైజాగ్ లోకల్ బాయ్ నానికి సంబంధించిన ఓ వీడియోపై సజ్జనార్ స్పందించారు. "మీరు డబ్బు సంపాదించుకోవాలంటే అనేక మార్గాలు ఉన్నాయి. ఇవేం దిక్కుమాలినపనులు. మీ టాలెంట్‌ను ఇతరత్రా రంగాల్లో ఉపయోగించుకుని సంపాదించుకోవడంలో తప్పులేదు. అలా చేస్తే మిమ్మల్ని సమాజం హర్షిస్తోంది. ఇలాంటి పనుల ద్వారా ఎంతో మందిని బెట్టింగ్ భూతానికి బానిసలను చేయడం ఎంత వరకు కరెక్టో ఒక్కసారి ఆలోచించండి. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లమని, మేం ఏం చేసిన నడుస్తుందనే భ్రమలో ఉండకండి. చట్టప్రకారం మీకు శిక్షలు తప్పవని గుర్తుంచుకోండి. ఇప్పటికైనా సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ ల ప్రమోషన్లను ఆపండి." అంటూ సజ్జనార్ లోకల్ బాయ్ నానికి సంబంధించిన వీడియో షేర్ చేశారు. ఈ పోస్టును వైజాగ్ సిటీ పోలీసులకు, ఏపీ డీజీపీకి, సైబర్ పోలీసులకు ట్యాగ్ చేశారు. సజ్జనార్ ట్వీట్‌కు స్పందించిన వైజాగ్ పోలీసులు.. కేసు నమోదు చేసి ఆదివారం (ఫిబ్రవరి 23న) మధ్యాహ్నం నానిని అరెస్ట్ చేశారు. అనంతరం అతన్ని కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించారు. కాగా నాని పై కేసు నమోదు చేయడంపై ఐపీఎస్ అధికారి సజ్జనార్ స్పందించారు. "బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేయడం మరియు వాటిలో పాల్గొనడం నేరం. ట్విట్టర్‌లో నా పోస్ట్ ఆధారంగా వైజాగ్ పోలీసులు.. అలా చేసినందుకు స్థానిక సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ లోకల్ బాయ్ నానిని అరెస్టు చేశారు. చట్టవిరుద్ధమైన బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ అరెస్టు ఒక ఉదాహరణగా ఉండాలి. అప్రమత్తంగా ఉండండి." అంటూ సజ్జనార్ రాసుకొచ్చారు.



అయితే.. అప్పటికే లోకల్ బాయ్ నాని బెట్టింగ్ యాప్ ప్రమోషన్లపై స్పందించారు. తాను చదవుకోలేదని.. చాలా మంది చదువుకున్న వాళ్లు కూడా ఈ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు. అలాగే నేను కూడా చేశానని.. కానీ తాను చేసింది తప్పని.. కానీ అది తప్పని తెలిసిన తర్వాత వెంటనే వాటిని ప్రమోట్ చేయటం ఆపేశానని చెప్పుకొచ్చాడు. సజ్జనార్ షేర్ చేసింది పాత వీడియో అని తెలిపిన నాని.. దాన్ని డిలిట్ చేయటమే కాకుండా.. ఇకపై ఎప్పుడు అలాంటివి ప్రమోట్ చేయనంటూ ఓ వీడియో విడుదల చేశారు.

నాని విడుదల చేసిన వీడియోపై కూడా సజ్జనార్ స్పందించారు. "ఎంతో మంది అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటున్న ఆన్ లైన్ బెట్టింగ్ ను ఇక నుంచి ప్రమోట్ చేయనని నాని ప్రకటించడం అభినందనీయం. మిగతా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా నానిలాగే సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఇక నుంచైనా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం ఆపండి. 'మేం అలానే చేస్తాం. మా ఇష్టం' అనుకుంటే మీపై చట్ట ప్రకారం చర్యలు తప్పవు." అని హెచ్చరించారు.

# వడ్డీ రేట్లు మార్చిన దిగ్గజ బ్యాంక్..




బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలను కుంటున్న వారికి అలర్ట్. ప్రముఖ బ్యాంక్ అయిన యాక్సిస్ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను సవరించింది. కొత్త వడ్డీ రేట్లు జనవరి 27వ తేదీ నుంచే అమలులోకి వచ్చినట్లు తెలిపింది. గరిష్ఠంగా 7.75 శాతం మేర వడ్డీ ఆఫర్ చేస్తోంది. మరి లేటెస్ట్ ఎఫ్‌డీ రేట్లు, గరిష్ఠ రేట్ల మెచ్యూరిటీ టెన్యూర్ వంటి పూర్తి వివరాలు తెలుసుకుందాం

మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకుంటున్నారా? అయితే మీకో అలర్ట్. ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన యాక్సిస్ బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. సవరించిన కొత్త వడ్డీ రేట్లను జనవరి 27వ తేదీ నుంచే అమలులోకి తీసుకొచ్చినట్లు తమ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలియజేసింది. వడ్డీ రేట్ల సవరణ ద్వారా జనరల్ కస్టమర్లకు 3 శాతం నుంచి 7.25 శాతం వరకు వడ్డీ రేట్లు కల్పిస్తుండగా.. సీనియర్ సిటిజన్లకు అదనంగా 50 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ ఇస్తోంది. అంటే గరిష్ఠ వడ్డీ రేట్లు 7.75 శాతం వడ్డీ లభిస్తోంది. ఆ వివరాలు తెలుసుకుందాం.

గరిష్ఠ వడ్డీ రేట్లు ఈ స్కీమ్ ద్వారానే..

యాక్సిస్ బ్యాంక్ వడ్డీ రేట్ల సవరణ తర్వాత రూ.3 కోట్ల లోపు ఉండే రిటైల్ డిపాజిట్లపై 7 రోజుల నుంచి 10 ఏళ్ల వరకు టెన్యూర్ డిపాజిట్లపై జనరల్ కస్టమర్లకు 3 శాతం నుంచి 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 3.50 శాతం నుంచి 7.75 శాతం వడ్డీ ఇస్తోంది. గరిష్ఠ వడ్డీ రేటు 15 నెలల నుంచి 2 ఏళ్ల మెచ్యూరిటీ పీరియడ్ గల ఎఫ్‌డీ స్కీమ్ పైన ఇస్తోంది. ఇందులో జనరల్ కస్టమర్లకు 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది.

యాక్సిస్ బ్యాంక్ లేటెస్ట్ ఎఫ్‌డీ రేట్లు..

- 7 రోజుల నుంచి 29 రోజుల వరకు సీనియర్ సిటిజన్లకు వడ్డీ రేట్లు 3.50 శాతంగా ఉన్నాయి
- 30 రోజుల నుంచి 45 రోజుల వరకు సీనియర్లకు 4 శాతం వడ్డీ ఇస్తోంది.
- 46 రోజుల నుంచి 60 రోజుల టెన్యూర్ డిపాజిట్లపై 4.75 శాతం వడ్డీ లభిస్తోంది.
- 61 రోజుల నుంచి 87 రోజుల వరకు 5 శాతం, 88 రోజుల నుంచి 3 నెలల 24 రోజుల వరకు 5.25 శాతం వడ్డీ ఇస్తోంది.
- 3 నెలల 25 రోజుల నుంచి 6 నెలల వరకు 5.25 శాతం వడ్డీ ఇస్తోంది.
- 6 నెలల నుంచి 9 నెలల వరకు 6.25 శాతం, 9 నెలల నుంచి ఏడాది లోపు 6.50 శాతం వడ్డీ ఇస్తోంది.
- ఏడాది నుంచి 15 నెలల వరకు 7.20 శాతం, 15 నెలల నుంచి 2 ఏళ్లలోపు వరకు 7.75 శాతం వడ్డీ ఇస్తోంది.
- 2 సంవత్సరాల నుంచి 5 ఏళ్ల వరకు 7.60 శాతం వడ్డీ ఇస్తోంది.
- 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల వరకు 7.75 శాతం ఇస్తోంది.

# మార్పుల నుంచి సెక్షన్ లిమిట్ పెంపు వరకు..




బడ్జెట్ 2025కు ఇంకొద్ది రోజులే ఉంది. ఈ క్రమంలో ఎవరి డిమాండ్లను వారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముందుంచుతున్నారు. అయితే ఎప్పుడూ పన్ను చెల్లింపుదారులు.. బడ్జెట్‌లో ప్రకటనల గురించి ఆసక్తిగా చూస్తుంటారన్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా మధ్యతరగతి వర్గం ఆదాయపు పన్నుకు సంబంధించి కొన్ని మార్పుల్ని కోరుకుంటున్నారు. అవేంటో చూద్దాం.

వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించి వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం.. ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 1న, ఉదయం 11 గంటల సమయంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. లోక్‌సభలో ప్రవేశపెడతారు. ఈసారి కూడా బడ్జెట్ సమావేశాల్ని రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న బడ్జెట్‌కు ముందుగానే.. జనవరి 31న ఆర్థిక సర్వేను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దేశ ఆర్థిక పరిస్థితుల్ని తెలియజేసేదే ఆర్థిక సర్వే. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇదే తొలి పూర్తి స్థాయి బడ్జెట్ కాబట్టి అంచనాలు ఎక్కువే ఉన్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి వర్గం.. ఆదాయపు పన్ను విధానంలో కీలక మార్పులు కోరుకుంటోంది. ఆదాయపు పన్నుకు సంబంధించి.. వారేం కోరుకుంటున్నారో ఇక్కడ చూద్దాం.

టాక్స్ శ్లాబుల్లో మార్పులు- మధ్యతరగతి వర్గానికి వ్యక్తిగత ఆదాయపు పన్నుకు సంబంధించి మరింత ఊరట కలిగించేలా నిర్మలమ్మ నిర్ణయం తీసుకోవాలని ప్రధాన డిమాండ్‌గా ఉంది. కనీస పన్ను మినహాయింపు పరిమితి ప్రస్తుతం రూ. 3 లక్షలుగా ఉండగా.. రూ. 4 లక్షలకు పెంచడం తప్పనిసరి అని.. ఇంకా టాక్స్ రిబేట్ లిమిట్ రూ. 7 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని టాక్స్2విన్ సీఈఓ అభిషేక్ సోనీ కోరుతున్నారు. రూ. 15 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి టాక్స్ రేట్లు తగ్గించాలని క్లియర్‌టాక్స్ టాక్స్ ఎక్స్‌పర్ట్ షెఫాలీ ముంద్రా అంటున్నారు.

ఇల్లు కొనుగోలు చేసే వారు లేదా నిర్మించుకోవాలనుకునే వారి కోసం కూడా వారిని ప్రోత్సహించేందుకు కొత్త పన్ను విధానంలో కీలక ప్రకటనలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హోమ్ లోన్లకు సంబంధించి పన్ను తగ్గింపు పరిమితి పెంచి ప్రోత్సాహకాల్ని ఇవ్వడం అనేది కూడా ప్రధాన డిమాండ్‌గా ఉంది. మినహాయింపు పరిమితిని రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెంచాలని ఇంకా.. విత్‌డ్రాయల్స్ కూడా పూర్తిగా టాక్స్ ఫ్రీ చేయాలని సోనీ డిమాండ్ చేస్తున్నారు.

టాక్స్‌పేయర్లకు సమానత్వం కింద.. ఎక్కువ జీవన వ్యయం ఉన్న నగరాలైన హైదరాబాద్, పుణె, బెంగళూరుల్లో కూడా హౌస్ రెంట్ అలవెన్స్ పరిమితిని 50 శాతానికి పెంచాలని కోరుతున్నారు.

సీనియర్ సిటిజెన్లకు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల బడ్జెట్‌లో పెంచిన షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్‌ను తగ్గించాలని కోరుతున్నారు. సీనియర్ సిటిజెన్లకు ఊరట కలిగించేలా వారికి కనీస పన్ను మినహాయింపు పరిమితి తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. టాక్స్ సేవింగ్స్ ఇన్వెస్ట్‌మెంట్లు పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, ఎల్ఐసీ ప్రీమియం వంటి వాటిపై సెక్షన్ ని కొత్త పన్ను విధానానికి కూడా అమలు చేసి.. ఇంకా లిమిట్ పెంచాలని కోరుతున్నారు.

# ఎయిర్‌టెల్ గుడ్‌న్యూస్.. ఆ ప్లాన్ల ధరల తగ్గింపు..

## రూ. 469తో ఇప్పుడు 84 రోజుల వ్యాలిడిటీ.. అన్‌లిమిటెడ్!

ట్రాయ్ ఆదేశాల నేపథ్యంలో ఇటీవల రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ వాయిస్ ఓన్లీ ప్లాన్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. వీటి కింద తక్కువ ధరల్లోనే ఎక్కువ రోజుల వ్యాలిడిటీతో.. అన్‌లిమిటెడ్ వాయిస్, ఎస్ఎంఎస్ సేవల్ని తీసుకొచ్చాయి. తాజాగా ఎయిర్‌టెల్ మరో గుడ్‌న్యూస్ చెప్పింది. తాజాగా తెచ్చిన ఈ ప్లాన్ ధరల్ని మరోసారి తగ్గించింది. ఇప్పుడు కొత్త ప్యాక్స్ అందుబాటులోకి వచ్చాయి.

దిగ్గజ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ శుభవార్త చెప్పింది. ఇటీవల తీసుకొచ్చిన వాయిస్ ఓన్లీ రీఛార్జ్ ప్లాన్ ధరల్ని మరోసారి సవరించింది. కిందటి సారి కంటే తక్కువ ధరలకే కొత్త ప్యాక్స్ ప్రవేశపెట్టింది. ఇప్పుడు ఈ వాయిస్, ఎస్ఎంఎస్ ఓన్లీ ప్లాన్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. కొద్దిరోజుల కిందట తీసుకొచ్చిన రెండు ప్లాన్ల ప్రయోజనాలు అలాగే ఉంచుతూ.. ఏ మార్పు చేయని ఎయిర్‌టెల్.. అంతకంటే తక్కువ ధరల్లోనే కొత్త ప్లాన్లను ప్రకటించడం విశేషం. ఇప్పటికే ఇవి రీఛార్జ్ ప్లాన్లలో అందుబాటులోకి వచ్చేశాయి. ఈ క్రమంలో పాత ప్యాక్స్‌ను వెబ్‌సైట్ నంచి తీసేసి అప్డేట్ చేసింది. ఇంతకుముందు ప్లాన్ ధరలు ఎలా ఉన్నాయి.. ఇప్పుడు ఎలా ఉన్నాయనేది చూద్దాం.

ఎయిర్‌టెల్ కొత్త ప్లాన్ ధర కేవలం రూ. 469 మాత్రమే. దీని కింద రీఛార్జ్ చేసుకుంటే.. ఏకంగా 84 రోజుల వ్యాలిడిటీతో అన్‌లిమిటెడ్ లోకల్ ఎస్టీడీ అండ్ రోమింగ్స్ కాల్స్ చేసుకోవచ్చు. ఇంకా 900లు లభిస్తాయి. దీంట్లో 3 నెలల పాటు అపోలో 24/7 సర్కిల్ మెంబర్‌షిప్ సహా హలో ట్యూన్స్ ప్రయోజనాల్ని కూడా పొందొచ్చు. దీనికి ముందు ఈ ప్లాన్ ధర రూ. 499 గా ఉండేది. అంటే దీనిపై రూ. 30 తగ్గించి అదే ప్లాన్ తీసుకొచ్చింది.

ఇక మరో ప్లాన్ విషయానికి వస్తే.. రూ. 1849తో ఉంది. ఇది యాన్యువల్ ప్లాన్ అని చెప్పొచ్చు. ఏకంగా 365 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఇక్కడ కూడా అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 3600 ఎస్ఎంఎస్‌లు వస్తాయి. ఇదే




ఎయిర్‌టెల్ కొత్త ప్లాన్ ధర కేవలం రూ. 469 మాత్రమే. దీని కింద రీఛార్జ్ చేసుకుంటే.. ఏకంగా 84 రోజుల వ్యాలిడిటీతో అన్‌లిమిటెడ్ లోకల్ ఎస్టీడీ అండ్ రోమింగ్స్ కాల్స్ చేసుకోవచ్చు. ఇంకా 900 లు లభిస్తాయి. దీంట్లో 3 నెలల పాటు అపోలో 24/7 సర్కిల్ మెంబర్‌షిప్ సహా హలో ట్యూన్స్ ప్రయోజనాల్ని కూడా పొందొచ్చు. దీనికి ముందు ఈ ప్లాన్ ధర రూ. 499 గా ఉండేది. అంటే దీనిపై రూ. 30 తగ్గించి అదే ప్లాన్ తీసుకొచ్చింది.

ప్రయోజనాలతో ఇటీవల తెచ్చిన ప్లాన్ ధర రూ. 1959 కాగా.. దాని కంటే ప్రస్తుత ప్యాక్ ధర రూ. 110 తక్కువగా ఉంది. దీనిపైనా అపోలో సర్కిల్, హలో ట్యూన్స్ బెనిఫిట్స్ పొందొచ్చు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల నేపథ్యంలోనే ఎయిర్‌టెల్ కొత్త ప్యాక్స్ ప్రకటించింది. ఇటీవల వాయిస్, ల కోసం ప్రత్యేకంగా రీఛార్జ్ ప్యాకేజీలు తీసుకురావాలని.. టెలికాం కంపెనీల్ని ట్రాయ్ ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో.. ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా ఇలా అన్నీ ప్రత్యేకంగా వాయిస్, కోసం డేటా లేకుండా ప్లాన్స్ తీసుకొచ్చాయి. అయితే.. వాటి ధరల్ని మరింత తగ్గించాలని ట్రాయ్ సూచించిన నేపథ్యంలోనే.. ఎయిర్‌టెల్ ఇప్పుడు తన ప్లాన్ ధరల్ని తగ్గించినట్లు గా తెలుస్తోంది. ఇదే సమయంలో రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా కూడా తమ ప్లాన్ రేట్లు సవరించొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అయితే.. ట్రాయ్ కొత్త నిర్ణయం ఆయా కంపెనీల ఆదాయంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# అక్రమవలసదారుపై అమెరికా అరాచకం!



అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరిగి స్వదేశాలకు పంపించి వేస్తున్నారు. ఈక్రమంలోనే వారిపై దారుణ చర్యలకు పాల్పడుతున్నారు. తాజాగా యూఎస్‌లో ఉంటున్న పలువురు అక్రమ బ్రెజీలియన్లను కాళ్లు, చేతులు కట్టేసి తాగేందుకు గుక్కెడు మంచి నీళ్లు కూడా ఇవ్వకుండా విమానంలో వారి దేశానికి పంపారు. కనీసం వారిని బాత్రూమ్‌లు కూడా వాడుకోనివ్వకుండా నరకం చూపించారు. అమెరికా తీరుపై బ్రెజిల్ సర్కారు ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

గతేడాది నవంబర్ నెలలో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి వారం రోజుల క్రితమే 47వ దేశాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు డొనాల్డ్ ట్రంప్. బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటున్నారు. వారిని తిరిగి స్వదేశాలకు పంపేందుకు అనేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా అమెరికానే అక్రమ వలసదారులను గుర్తించి.. 500 సైనిక విమానాల ద్వారా వారిని స్వదేశాలకు పంపుతోంది.

అయితే తాజాగా యూఎస్ సర్కారు.. బ్రెజిల్ నుంచి అక్రమంగా వచ్చి అమెరికాలో జీవిస్తున్న పలువురిని గుర్తించి తిరిగి వెనక్కి పంపింది. ఈక్రమంలోనే వారికి నరకం చూపించింది. జైల్లో ఉన్న ఖైదీల పట్ల చూపించే కనికరం కూడా చూపించకుండా తరలించడంపై బ్రెజిల్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికాలో అక్రమంగా వలస పొందుతున్న 80 మంది బ్రెజీలియన్లను ఆదివారం రోజు తిరిగి స్వదేశానికి పంపించింది. అయితే బ్రెజిల్ ఉత్తర నగరమైన మనౌస్‌లో ఆ విమానం ల్యాండ్ కాగా.. 80 మంది బ్రెజీలియన్ పౌరులు చేతులకు సంకెళ్లతో ఉన్నట్లు అక్కడి అధికారులు గుర్తించారు. ఈక్రమంలోనే వారందరినీ ప్రశ్నించగా అమెరికా వారికి చూపించిన నరకం గురించి చెప్పి కన్నీటి పర్యంతం అయ్యారు. ముఖ్యంగా తాము విమానంలో ఎక్కడానికి ముందే తమ చేతులకు సంకెళ్లు వేసినట్లు తెలిపారు.

ఆపై విమానంలోకి వచ్చి కూర్చున్నాక తమ కాళ్లు కూడా కట్టేశారని బ్రెజీలియన్లు వివరించారు. విమానంలో ఉండగా.. దాహం వేస్తుందని అడిగితే కనీసం గుక్కెడు మంచినీళ్లు కూడా అందించకుండా తమను ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. బాత్రూం వెళ్లాలని చెప్పినా వారు పట్టించుకోకుండా తమను అలాగే ఉంచారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాగేందుకు నీళ్లు లేక బాత్రూంకు వెళ్లలేక అనేక మంది అస్వస్థతకు గురయ్యారని స్పష్టం చేశారు. ముఖ్యంగా యూఎస్ నుంచి ఇదే విమానంలో వచ్చిన ఎడ్గర్ డా సిల్వా మౌరా అనే 31 ఏళ్ల కంప్యూటర్ టెక్నీషియన్ మాట్లాడాతూ.. బహిష్కరణకు ముందే తాను 7 నెలల పాటు అమెరికా నిర్బంధంలో ఉన్నట్లు తెలిపాడు. విమానంలో పలు సాంకేతిక సమస్యల వల్ల ఏసీలు కూడా పని చేయకపోవడంతో.. అనేక మంది మూర్ఛపోయారని వివరించారు.

అలాగే 21 ఏళ్ల లూయిస్ ఆంటోనియా రోడ్రిగ్స్ శాంటోస్ మాట్లాడుతూ.. ఏసీలు నాలుగు గంటలు పని చేయలేదని దీని వల్ల పలువురు శ్వాస తీసుకోవడానికి కూడా చాలా ఇబ్బంది పడ్డారని చెప్పారు. తాము వచ్చిన విమానం ఆగ్నేయ నగరమైన హోరిజోంటేలో ల్యాండ్ కావాల్సిందని కానీ సాంకేతిక సమస్యల కారణంగా మనౌస్‌లో ల్యాండ్ చేశారని స్పష్టం చేశారు. అక్రమ వలసదారుల పట్ల అమెరికా వ్యవహరించిన తీరుపై బ్రెజిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించింది. బ్రెజిలియన్ పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లేనని స్పష్టం చేసింది. ఇకపై పంపించే వారినైనా చేతులకు సంకెళ్లు లేకుండా.. గౌరవంగా తీసుకు రావాలని వెల్లడించింది. చూడాలి మరి అమెరికా ముున్ముందు మరేం చేయనుందో.

# ట్రంప్ హెచ్చరికలతో వెనక్కి తగ్గిన కొలంబియా..




అమెరికాలో ఉన్న అక్రమ వలస దారులను ప్రత్యేక సైనిక విమానాల్లో వారి స్వదేశానికి పంపే విషయంలో.. కొలంబియా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అమెరికా నుంచి వచ్చే విమానాలపై నిషేధం కూడా ప్రకటించింది. కానీ ట్రంప్ సుంకాలు పెంచుతామని హెచ్చరించడంతో కొలంబియా వెనక్కి తగ్గింది. అమెరికా పెట్టిన అన్ని నిబంధనలకు ఓకే చెప్పింది. దీంతో అగ్రరాజ్యం సైతం ఆ దేశంపై విధించిన సుంకాలు, ఆంక్షలను ఎత్తివేసింది. ఈ విషయాన్ని నేరుగా యూఎస్ సర్కారే వెల్లడించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అక్రమ వలదారులపై చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. వారందరినీ తిరిగి వారి దేశాలకు పంపించేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. ముఖ్యంగా 500 ప్రత్యేక సైనిక విమానాల ద్వారా అక్రమ వలదారులపను వారి స్వేదేశాలకు చేరుస్తున్నారు. అయితే ఈ చర్యలను కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వ్యతిరేకించి.. యూఎస్ విమానాలపై నిషేధం విధించారు. దీంతో ట్రంప్ సుంకాలు పెంచుతామంటూ హెచ్చరికలు జారీ చేయగా కొలంబియా వెనక్కి తగ్గింది. దీంతో అమెరికా సైతం.. ఆ దేశంపై విధించిన సుంకాలు, ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు వివరించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను 500 ప్రత్యేక సైనిక విమానాల్లో వారి స్వదేశాలకు పంపేందుకు ట్రంప్ సర్కారు చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలువురిని పంపించి వేసింది. ఈ చర్యలపై ప్రపంచ వ్యాప్తంగా నిరసన వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా తమ దేశానికి చెందిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ ప్రత్యేక విమానాల ద్వారా పంపకుండా.. పౌర విమానాల ద్వారా మాత్రమే వారిని తమ దేశానికి పంపించాలంటూ కొలంబియా తెలిపింది. అప్పటి వరకు అమెరికా విమానాలపై నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది.

గౌరవంగా పంపించేలా నిబంధనలు రూపొందిస్తేనే విమానాలను అనుమతిస్తామంటూ ఆ దేశ అధ్యక్షుడు గుస్తావో పెట్రో తెలిపారు. ఇప్పటికే కొన్ని సైనిక విమానాలను వెనక్కి పంపినట్లు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలంబియా సర్కారు విమానాలను వెనక్కి పంపడంపై జీర్ణించుకోలేకపోయారు. దీంతో కొలంబియా ఉత్పత్తులపై సుంకాలు 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా కొలంబియన్ సర్కారు అధికారుల వీసాలను కూడా వెంటనే రద్దు చేస్తామంటూ వెల్లడించారు. ఇవి కేవలం ప్రారంభ చర్యలు మాత్రమేనంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వెనక్కి తగ్గారు. అగ్రరాజ్యం అమెరికా పెట్టిన ఆంక్షలు, నిబంధనలకు ఓకే చెప్పారు. అమెరికా సైనిక విమానాలను తమ దేశంలోకి రానిస్తామని.. పౌరులను తమ దేశానికి ఆహ్వానిస్తామని ప్రకటించారు. దీనిపై తాజాగా యూఎస్ స్పందించింది. కొలంబియా వెనక్కి తగ్గడంతో.. ఆ దేశంపై విధించిన సుంకాలు, పలు ఆంక్షలను నిలివి వేస్తున్నట్లు ప్రకటించింది. కేవలం కొలంబియా మాత్రమే కాదు ఏ దేశం తమ పౌరులను వెనక్కి తీసుకోకపోయినా.. ఇలాంటి చర్యలే తీసుకుంటామంటూ వెల్లడించింది. ఈ విషయం అర్థం చేసుకుని అన్ని దేశాలు తమకు సహకరించాలని.. అక్రమ వలసదారులను స్వదేశాలకు రప్పించుకోవాలని వివరించింది.



# వయసు పైబడిన వరుణ్ని చూసి.. స్పృహ తప్పిన వధువు..

వయసు పైబడిన వ్యక్తిని ఓ యువతికి ఇచ్చి పెళ్లి చేయబోగా.. తన పక్కన కూర్చున్న వ్యక్తిని చూడగానే ఆ యువతి కేక వేసి పడిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఈ వీడియో నిజంగా జరిగింది కాదు. హ్యూమర్ కోసం తీసిన స్క్రిప్టెడ్ వీడియో.

వివాహం అనేది చాలా పెద్ద ప్రక్రియ. ఫొటోలు చూడటంతో మొదలుపెట్టి.. పెళ్లి చూపులు, ఎంగేజ్‌మెంట్, పెళ్లి, రిసెప్షన్.. ఇలా రోజుల తరబడి ఈ ప్రక్రియ సాగుతుంది. అయితే పాత రోజుల్లో ఈ సుదీర్ఘ ప్రక్రియ ఉండేది కాదు. పెద్దవాళ్లు వెళ్లి పిల్లను లేదా పిల్లాణ్ని చూసుకొని వచ్చి నేరుగా పెళ్లి చేసేవారు. పెళ్లయ్యేంత వరకు తన భర్త ఎలా ఉంటాడో భార్యకు తెలిసేది కాదు. ఇప్పటికీ ముస్లిం సమాజంలో అక్కడక్కడ ఇలాంటి కట్టుబాట్లు కనిపిస్తుంటాయి. ఇలాంటి కట్టుబాట్ల ఆధారంగా తీసిన ఓ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

"బంగ్లాదేశ్‌లో పెద్దలు కుదిర్చిన పెళ్లిలో.. తాను వివాహం చేసుకున్న వ్యక్తిని చూడగానే యువతి స్పృహతప్పి పడిపోయింది." అనే క్యాప్షన్‌తో ఉన్న ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్ పేజీలో 2025 జనవరి 25న పోస్టు చేశారు. చాలా మంది అమ్మాయిల విషయంలో ఇది నిజం అని వీడియోపై రాసుకొచ్చారు.

ఈ వీడియో నిజమేనా అని తేల్చడం కోసం సజగ్ టీమ్ వీడియో స్క్రీన్ షాట్ సాయంతో గూగుల్ రివర్స్ ఇమేజ్ సెర్చ్ ద్వారా వెతికింది. జనవరి 18న హెదయత్ ఇస్లాం వ్లాగర్ అనే యూట్యూబ్ ఛానెల్‌లో పోస్టు చేసిన వీడియో కనిపించింది. దానికి వైరల్ వీడియో, ఫన్నీ వీడియో అనే హ్యాష్ ట్యాగ్‌లు జతపరిచారు. వీడియో చివర్లో.. బాగా ఫేమస్ అయిన ఆఫ్రికా బుడ్డోడు నవ్వుతున్న పార్ట్ కనిపించింది. అయితే ఇన్‌స్టాలో కనిపించిన వీడియోలో ఈ పార్ట్ లేదు.

ఎక్స్‌లో సెర్చ్ చేయగా.. ఇంతియాజ్ మహమూద్ అనే యూజర్ పోస్టు చేసిన వీడియో కనిపించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో వాడిన క్యాప్షన్‌నే ఈ వీడియోకు సైతం వాడారు. జనవరి 25న పోస్టు చేసిన ఈ వీడియో 3.7 మిలియన్ల యూజర్లను రీచ్ కాగా.. 18 వేలకుపైగా లైకులొచ్చాయి. దీంతో మరికొందరు యూజర్లు పోస్టు చేసిన వీడియోలను సైతం సజగ్ టీమ్ గుర్తించింది.

అయితే ఈ వీడియోల కింద తప్పుడు సమాచారం అని రీడర్స్ జత చేసిన కంటెక్స్ట్ కనిపించింది. ఓ ఫేస్‌బుక్ లింక్‌ను సైతం జతపరిచారు. అది క్లిక్ చేయగా.. ఫేస్ బుక్ పేజీలో 'భార్య పరిస్థితి ఏంటో అల్లుణ్ని అడగండి' అని బెంగాలీ భాషలో రాసిన క్యాప్షన్‌తో పోస్టు చేసిన వీడియో కనిపించింది. 2024 జులై 26న పోస్టు చేసిన ఈ వీడియో డ్యురేషన్ 3 నిమిషాల 4 సెకన్లు ఉంది. ఫేస్ బుక్ పేజీకి సంబంధించిన సమాచారం చూడగా.. ఇంట్రోలో 'హలో ఫ్రెండ్స్, నేను డెల్వార్.. సౌదీ అరేబియాలో నివసిస్తున్నాను. మేం ఎవరినీ కించపర్చేందుకు వీడియోలు చేయము. కేవలం మన జ్ఞాపకాలను సజీవంగా ఉంచడానికే చేస్తాం.

మేం ఎలాంటి పెళ్లి కార్యక్రమం చేయము. మీకున్న ఫిర్యాదులను మాకు తెలియజేయండి' అంటూ ఈ-మెయిల్ ఐడీ, వాట్సాప్ నంబర్ ఇచ్చారు.

ఇంట్రోలో పేర్కొనట్టుగానే ఈ ఫేస్‌బుక్ పేజీలో పెళ్లికి సంబంధించి రకరకాల స్క్రిప్టెడ్ వీడియోలను పోస్టు చేశారు. దీన్ని బట్టి వైరల్ అవుతోన్న వీడియో స్క్రిప్టెడ్ అని సజగ్ టీమ్ నిర్ధారణకు వచ్చింది.

# బంగారం 90,000



బంగారం భగభగమండుతున్నది. ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పుత్తడి ధర మరో శిఖరానికి చేరుకున్నది. వరుసగా ఎనిమిది రోజులుగా పెరుగుతూ వచ్చిన గోల్డ్ ఏకంగా రూ.90 వేల మైలురాయిని అధిగమించింది.

బంగారం భగభగమండుతున్నది. ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పుత్తడి ధర మరో శిఖరానికి చేరుకున్నది. వరుసగా ఎనిమిది రోజులుగా పెరుగుతూ వచ్చిన గోల్డ్ ఏకంగా రూ.83 వేల మైలురాయిని అధిగమించింది. ఈ చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులతో దేశీయంగా డిమాండ్ ఊపందుకున్నదని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పద్రిగాముల బంగారం ధర రూ.200 ఎగబాకి రూ.90,100 పలికింది. అంతకుముందు ఈ ధర రూ.90,900గా ఉన్నది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.200 అధికమై రూ.82,700 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.330 ఎగబాకి రూ.90,420కి చేరుకోగా, 22 క్యారెట్ ధర మరో రూ.300 అధికమై రూ.89,500గా నమోదైంది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. కిలో వెండి ఏకంగా రూ.500 అధికమైంది. బులియన్ మార్కెట్లో వెండి రూ.94 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో కూడా వెండి రూ.1,000 అధికమై రూ.1,05,000 పలికింది.

# సూచీల వరుస ర్యాలీకి బ్రేక్




దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు చివరికి నష్టాల్లోకి జారుకున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు చివరికి నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలకు తోడు రియల్టీ, ఆయిల్‌అండ్ గ్యాస్, హెల్త్‌కేర్ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొనడంతో సూచీలు చివరకు నష్టాలను ఎదుర్కొన్నాయి. వారాంతపు ట్రేడింగ్‌లో ఒక దశలో 400 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 329.92 పాయింట్లు నష్టపోయి 76,190.46 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 113.15 పాయింట్లు కోల్పోయి 23,092.20 వద్ద పరిమితమైంది. మొత్తంమీద ఈవారంలో సెన్సెక్స్ 428.87 పాయింట్లు, నిఫ్టీ 111 పాయింట్లు కోల్పోయాయి. 30 షేర్ల ఇండెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, జొమాటో, టాటా మోటర్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, ఉల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు నష్టపోయాయి. కానీ, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రా, నెస్లె, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.

# పద్దులో పన్నెంత?

బడ్జెట్‌కు వేళైంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కొత్త పద్దును ప్రవేశపెట్టనున్నారు.

బడ్జెట్‌కు వేళైంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కొత్త పద్దును ప్రవేశపెట్టనున్నారు. అయితే కొన్నేండ్లుగా వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులకు బడ్జెట్ ఊరించి ఉసూరుమనిపిస్తూనే ఉన్నది. దీంతో ఈసారి పద్దులోనైనా మోదీ సర్కారు ఊరటనిస్తుందా? ముఖ్యంగా పాత పన్ను విధానం కింద సెక్షన్ 80లోని వివిధ క్లాజ్‌ల ద్వారా వర్తించే పన్ను మినహాయింపు పరిమితుల్ని పెంచుతారా? అన్నది మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

దేశ ప్రజల పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఆదాయ పన్ను శాఖ.. సెక్షన్ 80లోని వివిధ క్లాజ్‌ల కింద పన్ను మినహాయింపుల్ని కల్పిస్తున్నది. వ్యక్తులు, హిందూ అవిభా జ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) వీటిని అధికంగా క్లెయిం చేసుకోవచ్చు. వార్షిక ఆదాయానికి సంబంధించి ఐటీ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఆయా సెక్షన్ల కింద పన్ను మినహాయింపుల్ని తీసుకోవచ్చు. వాటిని పరిశీలిస్తే..

ట్యాక్స్‌పేయర్లు రకరకాల పన్ను మినహాయింపులను సెక్షన్ 80సీ కింద కోరవచ్చు. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాల (హెచ్‌యూఎఫ్)వారు అర్హులు. ఏటా రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీములు, పీపీఎఫ్/ఎస్‌పీఎఫ్/ఆర్‌పీఎఫ్, జీవిత బీమా ప్రీమియం చెల్లింపులు, గృహ రుణం అసలు, ఎస్ఎస్‌వై, ఎన్ఎస్‌సీ, ఎస్‌సీఎస్ఎస్ వంటి పథకాలకూ వర్తిస్తుంది. అలాగే 80సీసీసీ, 80సీసీడీ(1), 80సీసీఈ, 80సీసీడీ(1బీ), 80సీసీడీ(2) కింద కూడా క్లెయింలు చేసుకోవచ్చు.

వ్యక్తిగత, భాగస్వామి-పిల్లల కోసం తీసుకునే ఆరోగ్య బీమా కోసం ఏటా 25,000 వరకు సెక్షన్ 80డీ కింద పన్ను మినహాయింపును కోరవచ్చు. ఒకవేళ ట్యాక్స్‌పేయర్ వయసు 60 ఏండ్లు దాటితే ఇది రూ.50,000గా ఉన్నది. ఇక తల్లిదండ్రుల కోసం తీసుకునే ఆరోగ్య బీమాకూ మరో రూ.25,000 వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు. తల్లిదండ్రుల వయసు 60 ఏండ్లు దాటితే ఈ ప్రయోజనం రూ.50,000. మొత్తంగా ఆరోగ్య బీమాలకు చేసే చెల్లింపుల్లో గరిష్ఠంగా ఏటా లక్ష రూపాయలదాకా పన్ను మినహాయింపులు తీసుకోవచ్చు. అలాగే 80డీడీ కింద ట్యాక్స్‌పేయర్స్ తమపై ఆధారపడిన దివ్యాంగుల వైద్య చికిత్సకు చేసే చెల్లింపులకుగాను ఏటా రూ.1.25 లక్షలదాకా పన్ను మినహాయింపును అందుకోవచ్చు. ట్యాక్స్‌పేయర్స్ వ్యక్తిగతంగా తీసుకునే వైద్య చికిత్స ఖర్చులకూ సెక్షన్ 80డీడీబీ కింద లక్ష రూపాయల వరకు క్లెయిం చేసుకోవచ్చు.

దేశ, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి తీసుకున్న విద్యా రుణంపై చెల్లించే మొత్తం వడ్డీకి వ్యక్తిగత ఆదాయ పన్నులో సెక్షన్ 80ఈ కింద మినహాయింపు తీసుకోవచ్చు.

రుణంపై మొదటిసారి ఇల్లు కొన్నవారికి వర్తిస్తుంది. సెక్షన్ 80ఈఈఏ కింద గృహ రుణంపై చెల్లించే వార్షిక వడ్డీ మొత్తాల్లో రూ.1.5 లక్షల వరకు వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపును కోరవచ్చు. సెక్షన్ 24 కింద ప్రస్తుతమున్న రూ.2 లక్షల పన్ను మినహాయింపునకు ఇది అదనం. ఇక సెక్షన్ 80 ఈఈ కూడా ఉన్నది. అం దులో రూ.50,000 వరకే మినహాయింపును పొందేవారు. 2019 బడ్జెట్‌లో సెక్షన్ 80ఈఈఏను పరిచయం చేశారు.

విద్యుత్తు ఆధారిత వాహన (ఈవీ) కొనుగోలుదారులకు ఇది వర్తిస్తుంది. వాహన రుణంపై చెల్లించే వడ్డీలో సెక్షన్ 80ఈఈబీ కింద ఏటా రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు.

సామాజిక బాధ్యతతో చేసే విరాళాలపై పన్ను మినహాయింపును సెక్షన్ 80జీ ద్వారా అందుకోవచ్చు. విరాళాలనుబట్టి పూర్తిగా లేదా సగం మేరకు పన్ను మినహాయింపును తీసుకోవచ్చు. ఇక సెక్షన్ 80జీజీబీ కింద రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలపై కంపెనీలు




పన్ను మినహాయింపుల్ని క్లెయిం చేసుకోవచ్చు. అలాగే సెక్షన్ 80జీజీసీ కింద రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాలపై వ్యక్తులు క్లెయిం చేసుకోవచ్చు.

అద్దె ఇంట్లో నివసిస్తున్నా తమ జీతాల్లో హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ)ను పొందలేకపోతున్న ఉద్యోగులు.. సెక్షన్ 80జీజీ కింద పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. నెలకు రూ.5,000 చొప్పున ఏడాదికిగాను తమ వార్షిక ఆదాయంలో గరిష్ఠంగా రూ.60,000 వరకు పన్ను మినహాయింపును ఫారం 10 బీఏ ద్వారా కోరవచ్చు.

పేటెంట్ హక్కుల కింద రాయల్టీని పొందినప్పుడు సెక్షన్ 80ఆర్‌ఆర్‌బీ ద్వారా రూ.3 లక్షలదాకా పన్ను మినహాయింపుల్ని కోరవచ్చు. కాపీరైట్ లేదా రాయల్టీ ద్వారా పొందే ఆదాయంపై రచయితలు సెక్షన్ 80క్యూక్యూబీ కింద పన్ను మినహాయింపుల్ని కోరవచ్చు.

పొదుపు ఖాతాలపై వడ్డీ విషయంలో వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు సెక్షన్ 80టీటీఏ కింద ఏటా గరిష్ఠంగా రూ.10,000 వరకు పన్ను మినహాయింపును కోరవచ్చు.

60 ఏండ్లు, ఆపై వయసుగల సీనియర్ సిటిజన్లు తమ డిపాజిట్ల నుంచి పొందే వడ్డీ ఆదాయంపై సెక్షన్ 80టీటీబీ కింద ఏటా గరిష్ఠంగా రూ.50,000 వరకు పన్ను మినహాయింపును పొందవచ్చు.

భౌతిక, మానసిక సమస్యలతో బాధపడేవ్యక్తులకు సెక్షన్ 80యూ కింద తీవ్రతనుబట్టి రూ.75,000-1,25,000 వరకు పన్ను మినహాయింపును కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అయితే వైద్యుల ధృవీకరణ తప్పనిసరి.

ఈ సెక్షన్లపైనే గురి..

ప్రధానంగా సెక్షన్ 80సీ, డీ, ఈఈఏ, ఈఈబీ, జీజీ, టీటీబీల కింద ఐటీ మినహాయింపు పరిమితుల్ని పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. పెరిగిన ఖర్చులు, ద్రవ్యోల్బణం దృష్ట్యా ఈసారి బడ్జెట్‌లో ఊరటనివ్వాలని వేతన జీవులు, వ్యక్తిగత ట్యాక్స్‌పేయర్లు, సీనియర్ సిటిజన్లు కోరుతున్నారు. దీనివల్ల పొదుపు పథకాల్లో పెట్టుబడులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బీమా వంటివి అందరికీ ఆకర్షణీయంగా మారుతాయని నిపుణులు కూడా పేర్కొంటున్నారు. నిజానికి కరోనా దెబ్బకు కుప్పకూలిన దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. కానీ రూపాయి విలువ పతనం, తయారీ రంగం డీలా, ద్రవ్యోల్బణం విజృంభణ, అధిక వడ్డీరేట్ల కారణంగా ఆయా రంగాల్లో నిస్తేజం ఆవరించింది. దీంతో వినిమయ శక్తి పెరిగేలా ఆదాయ పన్ను రేట్లలో, శ్లాబుల్లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. అయితే పాత, కొత్త పన్ను విధానాలను తీసుకొచ్చిన మోదీ సర్కారు.. కొత్త పన్ను విధానానికే మెరుగులు దిద్దుతున్నదికానీ.. పాత పన్ను విధానాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. మరి ఈసారైనా ఈ విమర్శలు ఆగేలా నిర్ణయాలు ఉంటాయా? ఉండవా? అన్నది వేచిచూడాల్సిందే.

# గ్రాన్యూల్స్ లాభం 118 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.118 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది గ్రాన్యూల్స్ ఇం డియా. 2023-24 ఏడాది ఇదే త్రైమాసిక ంలో నమోదైన రూ.126 కోట్ల లాభంతో పోలిస్తే 6 శాతం తగ్గినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.118 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది గ్రాన్యూల్స్ ఇం డియా. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.126 కోట్ల లాభంతో పోలిస్తే 6శాతం తగ్గినట్లు బీఎస్ ఈకి సమాచారం అందించింది. ఏడాది క్రితం రూ.1,156 కోట్లుగా ఉన్న సంస్థ ఆదాయం ఈసారి త్రైమాసికంలో రూ. 1,138 కోట్లకు తగ్గినట్లు పేర్కొం ది. ఈ సందర్భంగా కంపె నీ సీఎండీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ..ఉత్తర అమెరికా నిరా శాజనక పనితీరు కనబరిచినప్పటికీ లాభాలను నమోదు చేసు కున్నట్లు చెప్పారు. గతేడాది సెప్టెంబర్‌లో అమెరికా నియం త్రణ మండలి హైదరాబాద్‌లో ఉన్న ప్లాంట్‌లో తనిఖీలు చేసి పలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఉత్పత్తిని నిలిపివేసిన ట్లు, మళ్లీ అక్టోబర్‌లో తిరిగి ప్రారంభించడం ఆర్థిక ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపిందన్నారు.



# మధ్యప్రదేశ్‌లో మద్యం బంద్..

మతపరమైన ప్రదేశాల్లో మద్యంపై నిషేధం విధిస్తూ మధ్య ప్రదేశ్ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కొత్త ఎక్సైజ్ పాలసీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ నిర్ణయం కూడా అమలు అవుతుందని బిజెపి సర్కారు స్పష్టంగా పేర్కొంది. వీటిలో ఉజ్జయిని, ఓంకారేశ్వర్, బాందక్పూర్, మైహర్, సల్కాన్‌పూర్, లింగ, దతియా, మండలేశ్వర్, మహేశ్వర్, మాండసౌర్, అమర్‌కంటక్, మాండ్లా, ముల్తాయ్, కుండల్‌పూర్, చిత్రకూట్, బర్మన్, పన్నా ఉన్నాయి. జ్యోతిర్లింగమైన ఉజ్జయినిలో కూడా మద్య నిషేధం ఉంటుందా అన్నదే ఇప్పుడు ఇటు భక్తులను, అటు ఆధ్యాత్మిక వాదులను తొలిచి వేస్తున్న ప్రశ్న. ఎందుకుంటే దేశంలో ఎక్కడా లేని విధంగా ఉజ్జయినిలోని కాలభైరవ ఆలయంలో ఆ దేవ దేవునికి మద్యాన్ని ప్రసాదంగా సమర్పిస్తుంటారు భక్తులు. పంచమకర తాంత్రిక ఆచారాల్లో భాగంగా స్వామి వారికి మద్యాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. ముఖ్యంగా మిగతా నాలుగు ఆచారాలైన మాంసం, మత్స్య, ముద్ర (గింజ), మైతున (శృంగారం) అనే వాటిని ప్రస్తుతం పాటించట్లేదు. కానీ మద్యం సమర్పణను మాత్రం కొనసాగిస్తున్నారు.

ఎక్కడైనా గుడి బయట పూలు, కొబ్బరికాయలు అమ్మే దుకాణాలు ఉండటం చూసే ఉంటారు. ఉజ్జయినిలో మద్యం అమ్మే దుకాణాలు ఉంటాయి. పూలు, కొబ్బరికాయలతో పాటు మద్యాన్ని కూడా బుట్టల్లో పెట్టి అమ్ముతుంటారు. ఎవరో ప్రైవేటు వ్యక్తులు ఇలా విక్రయిస్తుంటారని అనుకోవద్దు, ఏకంగా ప్రభుత్వమే కౌంటర్లు ఏర్పాటు చేసి కల్తీ లేని మద్యాన్ని విక్రయిస్తుంది ఇక్కడ. అయితే తాజాగా సర్కారు మద్యపాన నిషేధం విధిస్తూ చేసిన ప్రకటనల జాబితాలో ఉజ్జయిని కూడా ఉంది. మరి ఈ నిషేధం వల్ల ఆ దేవ దేవుడికి మద్యాన్ని సమర్పించే ఈ ఆచారం ఆగిపోతుందా అనేది ఇప్పుడు అందరిని తొలచివేస్తోంది. దీనిపై మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ స్పష్టతనిచ్చారు. ఎప్పటిలాగే కాలభైరవ స్వామికి మద్యం సమర్పించవచ్చని చెప్పారు సీఎం. ప్రసాదాన్ని ఆలయానికి తీసుకెళ్లవచ్చన్నవారు. ఉజ్జయినిలో మద్యం దుకాణాలను మూసివేస్తారు. కానీ ఆలయ పరిసరాల్లోని మద్యం కౌంటర్లు మాత్రం ఎప్పటిలాగే కొనసాగనున్నాయి. ఈ కౌంటర్లలోనే మద్యం కొనుగోలు చేసి కాలభైరవునికి సమర్పించవచ్చు.

# నలుగురు మహిళా సైనికులను విడుదల చేసిన హమాస్..




గాజా కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం .. హమాస్ తాజాగా నలుగురు మహిళా సైనికులను విడుదల చేసింది. ముఖ్యంగా వారి నలుగురినీ మిలిటరీ యూనిఫామ్‌లోనే తీసుకు వచ్చి రెడ్ క్రాస్‌కు అప్పగించింది. అయితే ఇందులో కరీనా అరీవ్, డానియెల్ గిల్‌బోవా, లిరి అల్బాజ్‌లతో పాటు నామా లెవి కూడా ఉంది. ఈమెను హమాస్ గతంలో తీవ్రంగా హింసించి తీసుకు వెళ్తున్న వీడియో వైరల్ కాగా.. ముఖమంతా రక్తంతో నిండిపోయి ఉంది. ప్రస్తుతం ఆమె సంతోషంగా నవ్వుతూ రాగా.. అంతా సంబుర పడిపోయారు. గాజా కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం.. హమాస్ శనివారం రోజు నలుగురు మహిళా సైనికులను విడుదల చేసింది. ముఖ్యంగా ఈ నలుగురిని మిలిటరీ యూనిఫామ్‌లోనే తీసుకు వచ్చి రెడ్ క్రాస్‌కు అప్పగించగా.. వారంతా తెగ సంబుర పడిపోతూ ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. అలాగే వీరి వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇందులో ఓ మహిళా సైనికురాలిని చూసి అంతా తెగ సంబుర పడిపోతున్నారు. ఆమె కూడా ఇందులో ఉందా అంటూ కామెంట్లు చేస్తూనే హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఆ మహిళా అధికారి ఎవరు, ఆ కథేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం. ప్రస్తుతం విడుదల అయిన నలుగురు మహిళా సైనికులను హమాస్.. 2023 అక్టోబర్ 7వ తేదీన గాజా సరిహద్దుకు సమీపంలోని వహల్ ఓజ్ మిలిటరీ బేస్ నుంచి బంధించి తీసుకెళ్లింది. అయితే అప్పుడు కేవలం 19 ఏళ్ల వయసు కల్గిన నామా లెవి కూడా అందులో ఉన్నారు. హమాస్ నామా లెవిని తీవ్రంగా కొట్టగా.. ముఖమంత్రి రక్తమయం అయింది. ఒళ్లంతా గాయాలు కాగా.. చేతులు కట్టిపడేసి జీపులో వేసుకుని వెళ్లిపోయారు. అప్పట్లో ఈ వీడియో నెట్టింట సంచలం రేపింది. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు హమాస్ వద్దే వీరంతా బందీలుగా ఉన్నారు. సరిగ్గా 477 రోజుల పాటు వీరికి హమాస్ నిత్యం నరకం చూపించింది. అయి తే తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రాగా.. మొదటి రోజే గాజా నుంచి ముగ్గురు ఇజ్రాయెల్ బందీలను హమాస్ విడుదల చేసింది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా 100 మంది పాలస్తీనా పౌరులకు విముక్తి కల్పించింది. ఈ నలుగురు అధికారుల కు మిలిటరీ యూని ఫామ్ వేసి మరీ తీసుకువచ్చి రెడ్ క్రాస్‌కు అప్పగించింది. అయితే వీరిలో కరీనా అరీవ్, డానియెల్ గిల్‌బోవా, లిరి అల్బాజ్‌లతో పాటు నామా లెవి కూడా ఉంది. అంతా సంబుర పడిపోతున్నారు. ముఖ్యంగా హమాస్ బంధీలుగా తీసుకు వెళున్న రోజు రక్తంతో తడిసిపోయిన నామా లెవి.. ఆమె.. ఈమెనే కదా అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇదంతా ఇలా ఉండగా.. 42 రోజుల తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందలో తమ చెరలో ఉన్న 94 మంది బందీల్లో 33 మందికి హమాస్ విముక్తి కల్పించబోతుంది. అలాగే అందుకు ప్రతిగా ఇజ్రాయెల్ 1700 మందికి పైగా పాలస్తీనియన్లను విడిచి పెట్టబోతుంది.

# స్విట్జర్లాండ్ నుంచి కాలినడకన మహాకుంభమేళాకు సాధువు..

ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13న ఆరంభమైన మహా కుంభమేళా అంగరంగ వైభవంగా సాగుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సంగమంగా గుర్తింపు పొందిన ఈ వేడుకలో భారతీయులతో పాటు విదేశీయులను కూడా పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతున్నారు. భక్తితో నిండిన ఈ క్రతువును చూసేందుకు దేశ విదేశాల నుంచి తరలివస్తున్నారు. పవిత్ర జలాల్లో స్నానం చేస్తూ పులకించిపోతున్నారు. అనేక మంది స్వామీజీలు, సాధువులు తమ ప్రవచనాలతో భక్తులు తరిస్తున్నారు. భారతీయులతో పాటు విదేశీయులను కూడా ఎంతగానో ఆకర్షిస్తోంది. అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభవం, ఉత్సాహభరితమైన ఊరేగింపులు, భక్తితో నిండిన ఈ క్రతువును చూసేందుకు ఆసక్తిగా తరలివస్తున్నారు. పవిత్ర జలాల్లో స్నానం చేయడం, ఆధ్యాత్మికవేత్తలు, రాజకీయ నాయకులు మొదలైన ప్రతి ఒక్కరికీ మరపురాని అనుభవం. ఇప్పటివరకు రికార్డుస్థాయిలో 10 కోట్లకు పైగా భక్తులు మహా కుంభమేళాలో పాల్గొన్నారు. విదేశాల నుంచి వేలాది మంది మహా కుంభమేళా 2025కి హాజరవుతున్నారు. ఐఐటీ బాబా, కాంటేవాలా బాబా, రుద్రాక్ష్ బాబా, ఇలా ఎందరో బాబాలను చూసి భక్తులు మురిసిపోతున్నారు. అయితే, ఈ క్రమంలో పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో పలు పాత వీడియోలు, తప్పుదారి పట్టించే వీడియోలు, ఫోటోలను షేర్ చేస్తున్నారు. మహా కుంభమేళాకు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అనేక తప్పుదారి పట్టించే వీడియోలు వైరల్ చేస్తున్నారు. తాజాగా, స్విట్జర్లాండ్ నుంచి కాలినడకన భారత్‌లో జరిగే కుంభమేళాకు విదేశీయుడు వచ్చాడని సోషల్ మీడియాలో వీడియోను తెగ షేర్ చేస్తున్నారు. అతడు ఐదేళ్ల కిందట స్విట్జర్లాండులో బయలుదేరాడని చెబుతోన్న ఈ వీడియో వైరల్ అవుతోంది. ఈ విదేశీయుడ్ని భారతీయ వ్యక్తి ఇంటర్వ్యూ చేయడం అందులో ఉంది. స్విట్జర్లాండ్ నుంచి భారత్‌కు చేరుకోడానికి ఐదేళ్ల నడిచానని, వివిధ దేశాల గుండా ప్రయాణించి, ఆయా దేశాల్లో వేర్వేరు వీసాలు తీసుకుంటూ వచ్చానని చెప్పడం కనిపిస్తోంది. ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో వీడియోను పోస్ట్ చేస్తూ.. 'విదేశీ భక్తుడు సనాతన ధర్మం గొప్ప తనం తెలుసుకొని స్విట్జర్లాండ్ నుంచి పుణ్యభూమి అయిన మన భారత దేశ కుంభమేళాకి శివుడి కోసం కాలి నడకన వచ్చాడు.. ఇక్కడ ఉన్న మన లౌకిక వాదులకు ఇది ఎపుడు అర్థం అవతుందో' అనే క్యాప్షన్ జోడించారు. మరి కొంత మంది 'స్విట్జర్లాండ్ నుంచి' అనే శీర్షికతోనూ.. 'కుంభమేళాకి శివుడి కోసం కాలి నడకన వచ్చిన భక్తుడు' అంటూ షేర్ చేస్తునారు.

# తొమ్మిదేళ్ల బాలిక కడుపులో కిలో వెంట్రుకలు..

చిన్న పిల్లలు ఎప్పుడూ అన్నం తినడానికి తెగ మారాం చేస్తారు. ఆ బాలిక కూడా అలాగే చేసింది. 9 ఏళ్ల వయసు వచ్చినా సరిగ్గా ఆహారం తీసుకో లేదు. తల్లిదండ్రులు బలవంతంగా పెట్టిన ప్రతీసారి వాంతులు చేసుకునేది. దీంతో భయపడ్డ అమ్మా, నాన్నలు వైద్యుల వద్దకు వెళ్లగా.. పరీక్షించిన డాక్టర్లు ఆమె కడుపులో కిలో వెంట్రుకలు ఉన్నట్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు షాక్ అయ్యారు. వెంటనే సర్జరీ చేయించి జుట్టు మొత్తాన్ని బయటకు తీయించారు. అయితే ఈ వెంట్రుకలన్నీ కడుపులోకి ఎలా వెళ్లాయో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

దాదాపుగా చిన్న పిల్లలందరూ అన్నం తినడానికి తెగ మారాం చేస్తుంటారు. కానీ పిల్లల కడుపుమాడుతుంటే చూడలేక కొట్టో, బతిమాలో తల్లిదండ్రులు బలవంతంగా వారికి గోరుముద్దలు పెడుతుంటారు. ఇలా బలవంతంగా పెట్టినప్పుడు పలువురు పిల్లలు వాంతులు చేసుకుంటూ ఉండడం కూడా సహజమే. కానీ 9 ఏళ్ల బాలిక కూడా ఇలాగే చేసింది. కడుపు నొప్పంటూ ఏడ్చింది. తినకపోవడం వల్లే ఇలా జరుగుతుందనుకున్న అమ్మా నాన్నలు కొన్నాళ్లు అలాగే ఉన్నారు. కానీ బాలికకు నొప్పి ఎక్కువ కాగా ఆస్పత్రికి తీసుకెళ్తే ఆమె కడుపులో వెంట్రుకలు ఉన్నాయని తేల్చారు వైద్యులు. మరి ఆ తర్వాత ఏం జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

బిహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందిన ఓ 9 ఏళ్ల బాలిక ఎప్పుడూ సరిగ్గా అన్నం తినేది కాదు. చిన్నప్పటి నుంచి అన్నం తినమనగానే మొహం చిరాగ్గా పెడతూ తల్లిదండ్రులకు చుక్కలు చూపించేది. కానీ వారు మాత్రం బతిమాలో, బామాలో బుజ్జాయికి అన్నం పెట్టేవాళ్లు. అయితే వయసు పెరుగుతూ వస్తున్న కొద్దీ బాలిక అలాగే చేయడంతో బెదిరించి మరీ అన్నం పెట్టడం ప్రారంభించారు. అయితే ఇటీవలే ఆ చిన్నారికి కడుపు నొప్పి వచ్చింది. ఆహారం సరిగ్గా తినకపోవడం వల్లే అలా జరిగిందని భావించిన తల్లిదండ్రులు.. బలవంతంగా చిన్నారికి అన్నం తినిపించారు. దీంతో వెంటనే వాంతి చేసుకుంది. అప్పుడు ఆపేసిన తర్వాతి రోజు అలాగే చేశారా అమ్మా, నాన్నలు. కానీ చిన్నారి మాత్రం వాంతులు చేసుకుంటూనే ఉంది. అలాగే కడుపు నొప్పంటూ విపరీతంగా ఏడవడం ప్రారంభించింది. దీంతో జనవరి 19వ తేదీన వాళ్లు స్థానికంగా ఉండే ఓ ఆస్పత్రికి వెళ్లారు. అయితే బాలికను పరీక్షించిన వైద్యులు.. ఆమె కడుపులో ఏదో గట్టి పదార్థం ఉందని చెప్పారు. చిన్నారినని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేయించాలని వివరించారు. అది విన్న తల్లిదండ్రులు వెంటనే ముజఫర్‌పూర్‌లోని శ్రీకృష్ణ మెడికల్ ఆస్పత్రికి వెళ్లారు.

అక్కడే వైద్యులు బాలికను పరీక్షించి ఆమెకు రక్తహీనత ఉందని గుర్తించారు. అలాగే చిన్నారి కడుపులో వెంట్రుకలు ఉన్నట్లు స్కానింగ్ ద్వారా తెలుసుకున్నారు. ఎలాగైనా సరే ఆ జుట్టును కడుపులోంచి తీసేయాలని చెప్పారు. అయితే రక్తం ఎక్కువగా లేదు కాబట్టి ముందు రక్తం ఎక్కించి ఆపై సర్జరీ చేశారు. ఇలా బాలిక కడుపులోంచి మొత్తంగా కిలో వెంట్రుకలను బయటకు తీశారు. ఆ తర్వాతే చిన్నారి తల్లిదండ్రులు వైద్యులతో మాట్లాడుతూ.. అసలు బాలిక కడుపులోకి ఇంత జుట్టు ఎలా వచ్చిందని అడిగారు.

ఈక్రమంలోనే వైద్యులు స్పందించి.. మీ అమ్మాయి ఎప్పుడైనా జుట్టు నమలడం వంటివి మీరు చూశారా అని అడిగారు. దీనికి వెంటనే తల్లిదండ్రులు అవునని.. కానీ చిన్నారి నమిలి ఉమ్మేస్తుందనుకున్నామని చెప్పారు. అలా చేయొద్దని చాలా సార్లు హెచ్చరించినా పాప వినలేదని తెలిపారు. కానీ ఇంత మొత్తంలో జుట్టు తినేసిందని మేము ఊహించలేదంటూ స్పష్టం చేశారు. అంతేకాకుండా చిన్నారి ఎప్పుడూ జుట్టు నములుతుందనే కోపంతోనే బాలికకు ఇటీవలే గుండు కూడా కొట్టించినట్లు వివరించారు. ఆ తర్వాతే కడుపు నొప్పి ఎక్కువైందని చెప్పగా.. పాపే జుట్టు తిందని వైద్యులు వెల్లడించారు. ముఖ్యంగా బాలికకు ట్రికోటిలోమేని యా అనే మానసిక జబ్బు ఉందని.. దీని వల్లే ఆమెకు ట్రికోబీజర్ అనే వ్యాధి సోకిందని చెప్పారు. ఈ జబ్బు బారిన పడ్డ వారంతా జుట్టు తింటారని దీన్ని శస్త్ర చికిత్స ద్వారా మాత్రమే తొలగించగలమని వివరించారు.

# బుట్టబొమ్మ అసహనం



పూజా హెగ్డే ప్రస్తుతం దేవా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే హిందీ మీడియాతో మాట్లాడుతూ కాస్త అసహనం వ్యక్తం చేసింది. సూపర్ స్టార్ చిత్రాల్లో అవకాశం వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నారా అంటూ పూజా హెగ్డేని ప్రశ్న అడిగితే.. కస్సుమంది. పదే పదే స్టార్ హీరోలు అంటూ ప్రశ్నలు వేయడంతో అసలు మీ ప్రాబ్లం ఏంటి? అంటూ ఫైర్ అయిపోయింది. సెలెబ్రిటీలు మీడియా ముందుకు వచ్చినప్పుడు ఏదో ఒక కాంట్రవర్సీ చెలరేగుతూనే ఉంటుంది. కొన్ని సార్లు మీడియా నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు సెలెబ్రిటీలు అసహనం వ్యక్తం చేస్తుంటారు. ఇంకొందరు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాట వేస్తుంటారు. ఇక పదే పదే ఒకే విషయానికి సంబంధించిన ప్రశ్నలు వస్తే మాత్రం ఇలా పూజా హెగ్డేలా కస్సుమంటారు. తాజాగా ఇలా హిందీ మీడియా ప్రతినిధిపై పూజా హెగ్డే అసహనం వ్యక్తం చేసింది. స్టార్ హీరోల సినిమాల్లో నటించడం అదృష్టంగా భావిస్తున్నారా అంటూ హృతిక్ రోషన్, సల్మాన్ ఖాన్, రణ్ వీర్ సింగ్, షాహిద్ కపూర్ చిత్రాల గురించి మీడియా ప్రతినిధి అడిగాడు. ఆ చిత్రాలకు తాను అర్హురాలినే అని పూజా హెగ్డే చెప్పుకొచ్చింది. తనను ఆ చిత్రాల్లోకి తీసుకునేందుకు దర్శకనిర్మాతలకు వారి వారి కారణాలుంటాయని తెలిపింది. ఏదైనా సరే అవకాశం వచ్చినప్పుడు దానికి న్యాయం చేయాలనేది ముఖ్యమని చెప్పింది.

అలా చేస్తే అదృష్టం వరించినట్టే అని తాను అనుకుంటానని పూజా హెగ్డే చెప్పింది. తన జీవితంలోనూ అదే జరిగిందని తాను భావిస్తానని పూజా హెగ్డే చెప్పింది. ఒక వేళ అదృష్టం వల్లే తనకు అవకాశాలు వచ్చాయని అనుకున్నా కూడా తనకేమీ అభ్యంతరం లేదని, అలానే అనుకోండని కౌంటర్లు వేసింది. మీరు సినిమాల్ని ఎలా సెలెక్ట్ చేసుకుంటారు..? స్టార్ హీరోల సినిమాలు అయితేనే చేస్తారా? అని అడిగితే పూజా హెగ్డే ఫైర్ అయిపోయింది. అలా పదే పదే స్టార్ హీరోలు అని మెన్షన్ చేసి ప్రశ్నలు వేస్తుండటంతో.. అసలు మీ బాధ ఏంటి? అని అడిగేసింది. దీంతో ఆ టాపిక్‌ను డైవర్ట్ చేస్తూ వాతావరణాన్ని కూల్ చేసేందుకు షాహిద్ కపూర్ జోకులు వేశాడు. దేవా సినిమాకు గొప్ప టాక్ ఏమీ రాలేదన్న సంగతి తెలిసిందే.

# తాళిబొట్టు ఎక్కడ?







కీర్తి సురేష్ పెళ్లి తరువాత వెంటనే బేబీ జాన్ మూవీ ప్రమోషన్స్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ ప్రమోషన్స్‌లో కీర్తి సురేష్ కాస్త బోల్డ్ దుస్తుల్లోనే కనిపించింది. కానీ ఆమె మంగళసూత్రం హైలెట్ అయ్యేలానే క్యాస్టూమ్స్‌ను ప్రిపేర్ చేసుకుంది. తాళి బొట్టు తీయకుండా అలానే పెట్టుకుందని, మన ఆచారాల్ని పాటిస్తోందంటూ కీర్తి సురేష్ మీద ప్రశంసలు కురిపించారంతా. తాజాగా ఆమె వదిలిన ఫోటోల మీద కొందరు తెలిసీ తెలియకుండా ట్రోలింగ్ చేస్తున్నారు.

కీర్తి సురేష్ ప్రస్తుతం ఫ్యామిలీ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తోంది. బేబీ జాన్ అంటూ గత డిసెంబర్ ఫుల్ బిజీగా ఉండిపోయింది. పెళ్లి టైంలోనే సినిమా ప్రమోషన్స్ కూడా చేయాల్సి వచ్చింది. అటు పెళ్లి పనులు, ఇటు సినిమా పనుల్ని కవర్ చేసింది కీర్తి సురేష్. అయితే ఎంత కష్టపడ్డా కూడా తగిన ప్రతిఫలం అయితే రాలేదు. బేబీ జాన్ అంటూ బాలీవుడ్‌లో గ్రాండ్‌గా అడుగు పెట్టాలని కీర్తి సురేష్ చూసింది. కానీ ఆమె డెబ్యూ సినిమా అక్కడ డిజాస్టర్‌గా మారింది. ఇక ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా కీర్తి సురేష్ తాళిబొట్టుతో కనిపించి అందరినీ మెప్పించింది. బోల్డ్ అవతారంలో ఉన్నా కూడా, సినిమా ప్రమోషన్స్‌లోనూ తాళి బొట్టు తీయలేదని, మన ట్రెడిషన్‌ను బాగానే ఫాలో అవుతోందంటూ కీర్తి సురేష్ మీద అంతా ప్రశంసలు కురిపించారు. అయితే తాజాగా కీర్తి సురేష్ వదిలిన ఫోటోలు చూసి కొందరు షాక్ అవుతున్నారు. కీర్తి సురేష్ తాజాగా వదిలిన ఫోటోల్లో తాళి బొట్టు కనిపించలేదు. దీంతో మంగళసూత్రం ఏది? అప్పుడే తీసేశావా? అంటూ ట్రోలింగ్ చేస్తున్నారు. కానీ అవి మెహెందీ ఈవెంట్ ఫోటోలని, పెళ్లికి ముందు దిగిన ఫోటోలని తెలుసుకోలేకపోతోన్నారు. కీర్తి సురేష్ తన చిన్న నాటి స్నేహితుడు ఆంటోని తట్టేల్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ విషయాన్ని రీసెంట్‌గానే కీర్తి సురేష్ చెప్పింది. ఇక ఓసారి ఆంటోని బర్త్ డేకు దళపతి విజయ్‌ను సీక్రెట్‌గా పిలిచి సర్ ప్రైజ్ చేసిందట. అదే ఆంటోనికి తాను ఇచ్చిన బెస్ట్ సర్ ప్రైజ్, బెస్ట్ గిఫ్ట్ అని కీర్తి సురేష్ చెబుతుంటుంది.

# డిస్ట్రిబ్యూటర్ మాటల అర్థమిదేనా?

డిస్ట్రిబ్యూటర్ల పరిస్థితి ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. నష్టాలు వచ్చినా కూడా బయటకు చెప్పుకోలేని దుస్థితిలో ఉంటారు. ప్రొడక్షన్ కంపెనీలో, హీరో సైడ్ నుంచే డిస్ట్రిబ్యూటర్లకు ఒత్తిడి కామన్‌గానే ఉంటుంది. అందుకే పెద్ద సినిమాలు హిట్ అని చెప్పుకున్నా కూడా కింది స్థాయిలో డిస్ట్రిబ్యూటర్లకు మాత్రం భారీ నష్టాల్ని మిగిల్చేస్తుంటుంది. అలా తాజాగా వెస్ట్ డిస్ట్రిబ్యూటర్ ఎల్వీఆర్ తాజాగా మాట్లాడిన మాటలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.సంక్రాంతి సీజన్‌లో రిలీజ్ అయిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాకి అదిరిపోయే టాక్‌తో పాటు, బ్లాక్ బస్టర్ కలెక్షన్లు వచ్చాయి. ఈ మూవీకి ఇప్పటికే 300 కోట్లకు పైగా గ్రాస్ వచ్చింది. ఈ లెక్కలు మాత్రం నిజం అన్నట్టుగా డిస్ట్రిబ్యూటర్లంతా కూడా మీడియా ముందుకు వచ్చారు. అసలు లెక్కల్ని డిస్ట్రిబ్యూటర్లు ఎప్పుడూ బయటపెట్టరు.

# నాని కోసం మరోసారి...



శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం నానితో ఓ సినిమాను చేస్తున్నాడు. ప్యారడైజ్ మూవీతో శ్రీకాంత్ ఓదెల మరోసారి రచ్చ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఈ క్రమంలో ఈ మూవీకి అనిరుధ్‌ను తీసుకుంటున్నారని ఇది వరకు రూమర్లు వచ్చాయి. ఇప్పుడు ఆ రూమర్లనే నిజం చేశారు. అనిరుధ్ సంగీత సారథ్యంలో నాని మరోసారి అందరినీ మెప్పించేందుకు రెడీ అవుతున్నాడు. గ్యాంగ్ లీడర్, జెర్సీలతో నాని అనిరుధ్ కాంబోకి క్రేజ్ పెరిగిందన్న సంగతి తెలిసిందే.



నాని, అనిరుధ్ అంటే అందరికీ గ్యాంగ్ లీడర్, జెర్సీ సినిమాలు గుర్తుకు వస్తాయి. అందులో నాని కోసం అనిరుధ్ ఇచ్చిన మెలోడీ పాటలు శ్రోతల్ని ఎంతగా ఆకట్టుకున్నాయో అందరికీ తెలిసిందే. నాని, అనిరుధ్ కాంబోకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇక శ్రీకాంత్ ఓదెలతో నాని చేస్తున్న రెండో ప్రాజెక్ట్ కోసం అనిరుధ్‌ను తీసుకోవాలి అంటూ ఫ్యాన్స్ డిమాండ్ చేస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. ప్యారడైజ్ ప్రాజెక్ట్ కోసం అనిరుధ్ లాక్ అయ్యాడంటూ రూమర్లు కూడా వచ్చాయి.

ఇక ప్యారడైజ్ కోసం అనిరుధ్‌ను రంగంలోకి దించామని యూనిట్ అధికారికంగా ప్రకటించింది. అంతే కాకుండా ప్యారడైజ్ ప్రపంచాన్ని చూపించే క్రమంలో ఓ గ్లింప్స్‌ను కూడా రెడీ చేస్తున్నారట. ఆ గ్లింప్స్‌లో నాని, అనిరుధ్ కాంబో సత్తా ఏంటో చూపించేలా ఎన్నో హై మూమెంట్స్ ఉంటాయని తెలుస్తోంది. ఈ గ్లింప్స్‌ను శ్రీకాంత్ ఓదెల నెక్స్ట్ లెవెల్లో ప్లాన్ చేశాడని, అద్భుతంగా ఉండబోతోందని అంటున్నారు.

ప్రస్తుతం నాని హిట్ 3 సినిమాను ఫినిష్ చేసే పనిలో పడ్డాడు. ఆ తరువాత ప్యారడైజ్ మూవీ మీదకు పూర్తిగా షిఫ్ట్ అవుతాడు. శ్రీకాంత్ ఓదెల

పూర్తి ఫోకస్ అయితే ప్రస్తుతం ప్యారడైజ్ మీదే ఉందన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ తరువాత శ్రీకాంత్ ఓదెల తన ఫుల్ కాన్సన్‌ట్రేషన్ చిరు మూవీ మీద పెట్టబోతోన్నాడు. ఇప్పటికే చిరు ఓదెల ప్రాజెక్ట్ మీద ఏర్పడిన అంచనాలు అందరికీ తెలిసిందే. బ్లడ్ బాత్ చేయించేలా ఈ సినిమా ఉండబోతోందని ఆ పోస్టర్లను చూస్తేనే తెలుస్తుంది.

శ్రీకాంత్ ఓదెలకు మంచి మ్యూజిక్ టేస్ట్ ఉందని దసరా మూవీని చూస్తేనే తెలుస్తుంది. పాటలైనా, ఆర్ఆర్ అయినా కూడా తన మార్క్ ఉండేలా చూసుకున్నాడు శ్రీకాంత్ ఓదెల. మరి ఈ ప్యారడైజ్ మూవీకి ఎలాంటి అవుట్ పుట్‌ను అనిరుధ్ నుంచి రాబట్టుకుంటాడో చూడాలి. అసలే నాని అంటే అనిరుధ్ మంచి మెలోడీస్ ఇస్తుంటాడని టాక్. ఈ సారి ఎలాంటి ఆల్బమ్ వస్తుందో చూడాలి.




శ్రీశైల దేవస్థానం
శ్రీశైలం
SRISAILA DEVASTHANAM
మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు
ముఖ్య కార్యక్రమాలు

26-02-2025 మహాశివరాత్రి
సాయంత్రం 5:30 గం.లకు ప్రభోత్సవం
రాత్రి 7:00 గం.లకు నందివాహన సేవ
రాత్రి 10:00 గం.ల నుండి శ్రీ స్వామి వారికి లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ, రుద్రాభిషేకం, పాగాలంకరణ
రాత్రి 12:00 గం.లకు శ్రీ స్వామి అమ్మవార్ల దివ్య కల్యాణమహోత్సవం

27-02-2025
సాయంకాలం 5:00 గం.లకు రథోత్సవం
రాత్రి 8:00 గం.లకు తెప్పోత్సవం

28-02-2025
ఉదయం గం. 8.10 లకు పూర్ణాహుతి, కలశోద్వాస, అవభృథం, వసంతోత్సవం, త్రిశూలస్నానం
సాయంత్రం గం. 6.00 లకు సదస్యం, నాగవల్లి, ఆస్థానసేవ
రాత్రి గం. 7:30 లకు ధ్వజావరోహణ

01-03-2025
రాత్రి గం. 7:30 లకు అశ్వవాహన సేవ
రాత్రి గం. 8:30 లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ

యం. శ్రీనివాస రావు
కార్యనిర్వహణాధికారి





శ్రీ మహానందీశ్వరస్వామి వారి దేవస్థానము
మహానంది, నంద్యాల జిల్లా
2025 మహా శివరాత్రి బ్రహ్మోత్సవముల ఆహ్వానము

2025-మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవములు
తేది: 24.02.2025 నుండి 01.03.2025 వరకు అత్యంత వైభవముగా జరుగును.

కార్యక్రమము వివరములు

| తేది: & వారము | ఉదయం | సాయంత్రం | రాత్రి |
|---|---|---|---|
| 24-02-2025 సోమ వారం | | ధ్వజారోహణం | మయూర వాహన సేవ |
| 25-02-2025 మంగళ వారము | సూర్యప్రభ వాహన సేవ | | సింహ వాహన సేవ |
| 26-02-2025 బుధ వారము | రావణ వాహన సేవ | | నంది వాహన సేవ |
| మహాశివరాత్రి : | రాత్రి గం.10:00ల నుండి లింగోద్భవ కాల మహారుద్రాభిషేకము<br>రాత్రి గం.3:00ల నుండి శ్రీ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవము | | |
| 27-02-2025 గురు వారం | శేష వాహన సేవ | | పుష్ప పల్లకి సేవ |
| 28-02-2025 శుక్ర వారం | అశ్వ వాహన సేవ | రథోత్సవము | పుష్పశయనోత్సవము |
| 01-03-2025 శని వారం | మహాపూర్ణాహుతి & నాగబలి పూజ | త్రిశూల స్నానము ధ్వజ అవరోహణం | తెప్పోత్సవం |

కావున భక్తులు లక్షలాదిగా తరలి వచ్చి శివరాత్రి బ్రహ్మోత్సవములను ప్రత్యక్షముగా వీక్షించి సకల ఐశ్వర్యములను పొందగలరని కోరుచున్నాము. మరియు దేవస్థానము నందు నిర్మించబోవు వసతి గదులు, కాటేజీలు నిర్మించుటకు మరియు దేవస్థానము నందలి నిత్యాన్నదాన పథకమునకుగాను మహోన్నత మహారాజ పోషకులు రూ.1,00,116/-
మహారాజ పోషకులు రూ.51,116/-,
రాజ పోషకులు రూ.25,116/-, పోషకులు రూ.5.116/-
విరాళములుగా చెల్లించి శ్రీ స్వామి అమ్మవార్ల అనుగ్రహమునకు పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము.



ఎన్. శ్రీనివాస రెడ్డి, కార్యనిర్వహణాధికారి


Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,